సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

APTEL 14598/2015.

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com  facebook.com/rajadhaniv

అమరావతి | ఆదివారం 6 మార్చి, 2016 సంపుటి : 1 సంచిక 23 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల: రూ. 5.00


## ప్రభుత్వం భూ బకాసురుడిగా మారింది



విలేకరులతో మాట్లాడుతున్న గాదె.కన్నారావు నాయుడు, పండలనేని శ్రీమన్నారాయణ,గుండపు చంద్రశేఖర్

- 7న, ప్రభుత్వ కోర్టు ధిక్కరణ కేసుపై విచారణ
- కృష్ణానది ఆక్రమణకు రంగం సిద్ధం
- త్వరలో బ్యారేజి కనుమరుగు

**రాజధాని ప్రతినిధి రాజధాని :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని నిర్మాణంలో భాగంగా తాత్కాలిక సచివాలయ శంకుస్థాపన ఫిబ్రవరి 17న వెలగపూడిలో ఘనంగా జరిగింది. జూన్‌కల్లా సచివాలయ ఉద్యోగులు ఇక్కడి నుంచే తమ కార్యక్రమాలను నిర్వహించాలని తలంచడంతో తాత్కాలిక సచివాలయ నిర్మాణం ఆగమేఘాలపై నిర్వహిస్తున్నారు. అయితే నీటి నిల్వలు, సారవంతమైన భూమి, ఇక్కడ అనేక పురాతన కట్టడాలు అంతరించిపోతాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ప్రముఖ పర్యావరణ సామాజిక వేత్త పండలనేని శ్రీమన్నారాయణ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే... శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాజధాని భూములపై నివేదిక ఇవ్వాలని ఎన్‌జీటీ ప్రభుత్వాన్ని ఆదేశించిందని, అయితే గత 8 నెలలుగా ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపడంలేదన్నారు. ఈనెల 23న చేపట్టిన విచారణలో నివేదిక గడువును పెంచాలని ప్రభుత్వం కోరిందని, దీనికి స్పందించిన కోర్టు ప్రభుత్వానికి రెండు వారాల సమయాన్ని కేటాయించిందన్నారు. ఎన్‌జీటీ ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రభుత్వం నిర్మాణాలను మాత్రం యుద్ధప్రాతిపదికన నిర్మిస్తుందని ఆయన విమర్శించారు. సారవంతమైన భూములలో నిర్మాణాలు జరపరాదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం బే ఖాతరు చేసిన విషయంలో కోర్టు ధిక్కార కేసును మార్చి 7న విచారణ చేపట్టనుందని ఆయన తెలిపారు. నేషనల్ హైవేలను ఏర్పాటు చేసే విషయంలో మంత్రులు, అధికారులు ఒకరికిఒకరు వ్యతిరేకంగా ప్రకటనలు ఇవ్వడంతో స్థానికులు భయకంపితులవుతున్నారు. అధికారులు దాదాపు 3వేల ఇళ్లు తొలగిస్తామనగా, మంత్రి నారాయణ మాత్రం కేవలం 300 ఇళ్లు మాత్రమే పోతుందన్నారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం వంపుల్లేని రోడ్లకోసం పట్టుదలగా ఉన్నారు. దీంతో నిర్వాసితులంతా ఆందోళనకు గురవుతున్నారు. మరో దారుణ విషయం ఏమంటే స్వయంగా ముఖ్యమంత్రే కృష్ణానదిలో సుమారు 500 గజాల మేర భూ ఆక్రమణలకు సిద్దమవుతున్నారనీ, ఇదే జరిగితే ప్రకాశం బ్యారేజీ ఉండదన్నారు. విజయవాడ నగరం మొత్తానికి వరద ముంపు ఉంటుందన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి నివశిస్తున్న గెస్ట్‌హౌస్, మరికొంతమంది రాజకీయ నాయకుల ఇళ్లను, లంకభూములను క్రమబద్ధీకరణ జరపటానికేనని శ్రీమన్నారాయణ ఆరోపించారు. రాష్ట్రం మొత్తం మీద 10 లక్షల ఎకరాలను తీసుకునేందుకు ప్రభుత్వం సమాలోచనలు జరుపుతుందని, దీనిద్వారా ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తుందన్నారు. అయితే చిన్న, మధ్యతర గతి రైతులంతా రోడ్డున పడుతున్నారని, రైతుకూలీలతో సహా 1లక్షా 50 వేలమంది రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గపు పోకడలను, రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులను రాబోయే తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో 350 పేజీల సమాచారంతో 'కాలనాళిక'ను నిష్ణాతులైన వివిధ రంగాల్లోని నిపుణులతో ప్రచురించి ప్రతిజిల్లాలోనూ దీన్ని భూమిలో భద్రం చేస్తామన్నారు.

***గుండపు చంద్రశేఖర్***

లింగాయపాలెంకు చెందిన రైతు గుండపు చంద్రశేఖర్ మాట్లాడుతూ డిసెంబరు 8 2015లో మా ఏడెకరాల అరటి తోటను సీఆర్‌డీఏ అధికారులు ధ్వంసం చేసి భూమిని చదును చేశారనీ, తాము చేసిన తప్పిదాన్ని ఒప్పుకొని జరిగిన నష్టాన్ని అంచనావేసి పరిహారం చెల్లిస్తామన్నారన్నారు. అయితే ఇప్పటివరకు అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేదని, రావాల్సిన రూ. 24 లక్షలు త్వరగా ఇప్పించాలని మీడియా ద్వారా కోరుతున్నానన్నారు.

***డాక్టర్. గాదె.కన్నారావు నాయుడు***

తాడేపల్లి మండలం మండలంలోని ఉండవల్లి గ్రామానికి చెందిన గాదె. కన్నారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఆర్‌డీఏ రూపొందించిన మాస్టర్ పై అభ్యంతరాలను తెలియచేసినా, ఇంతవరకు అధికారులు స్పందించలేదన్నారు. వారధి నుంచి ఉండవల్లి వరకు 50 మీటర్ల వెడల్పున ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎన్‌హెచ్ 5 రోడ్డు నిర్మాణం ఉండవల్లిలో చీలుతుందని, దీనివల్ల స్మశానవాటికలు ధ్వంసం అవుతాయన్నారు. అంతేకాకుండా ఉండవల్లిలోని నాలుగు ప్రాచీన దేవాలయాలు తొలగింపుకు గురవుతాయని, పురాతత్వ సెక్షన్‌లోని 33,1993 ప్రకారం తొలగింపు చట్టవిరుద్ధమని, ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా ప్రసిద్ధి చెందిన ఉండవల్లి గుహలకు కూడా ముప్పు పొంచి ఉందన్నారు. అలాగే ఉండవల్లిలోని ఆత్యాధ్మిక మందిరాలైన ఇస్కాన్, వేదాద్రి తపోవనం, ఓంకార్ ధ్యానమందిరాలు తొలిగింపుకు గురవుతాయన్నారు. వెంకట పాలెంలోని ప్రకృతి చికిత్సాలయం, తాడేపల్లి చైతన్యతపోవనం, తాళ్లాయపాలెం శివక్షేత్రం, యర్రబాలెం కృష్ణానంద ఆశ్రమం, మహవీర్‌జైన్ గోశాల, అనేక మఠాలు, దేవాలయాలు కనుమరుగవుతాయని కన్నారావు తెలిపారు.

## ఈవారం రాజధాని

- అమరావతిలో అంతర్జాతీయ క్రీడాప్రాంగణం అభివృద్ధికి కృషి
- పేదలకు ఉచితంగా ఇసుక సౌకర్యం ఉంది.
- అమరావతిలో ఎయిర్‌టెల్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.
- 8వ వండర్‌గా అమరావతి ఉండాలని సి.ఎం. అన్నారు.
- మొట్టమొదటి నాల్డెజ్‌జోన్‌గా అమరావతి ఏర్పాటు చేయనున్నారు
- అమరావతికి రైల్వేజోన్‌ను కోరిన యమ్.పి. గల్లా జయదేవ్
- విజయవాడలో ఉక్కు నిల్వ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం
- ఫిబ్రవరి 28న కొండవీడులో మ్యూజియమ్ శంఖుస్థాపన
- మార్చి7న శివరాత్రికి ఉత్సవాలకు అమరావతికి కొత్తబస్సులు వేయనున్న ఆర్టీసీ
- తల్లీ, పిల్లా క్షేమానికి గర్భిణుల కోసం ప్రత్యేకంగా 104 సిబ్బందిని ఏర్పాటు చేసిన సి.ఎం.

## పేదరిక నిర్మూలనే లక్ష్యం



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, చిత్రంలో మంత్రి సుజాత తదితరులు

- ఫించన్‌ల కోసం రూ.6 వేల కోట్లు
- సబ్సిడీ బియ్యం కోసం రూ. 4,500 కోట్లు
- మహిళా గ్రూపులను ఆదుకునేందుకు రూ.10వేల కోట్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజధాని ప్రతినిధి, ఏలూరు :** పేదరిక నిర్మూలనే తన లక్ష్యమని, అందుకు ఎంత ఖర్చయినా వెనుకాడబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏలూరులో జరిగిన కాపుల రుణమేళా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పేదవర్గాలకు అండగా ఉండటమే తన లక్ష్యమని, అనుకున్న లక్ష్యాలను ఖచ్చితంగా అందుకుంటామని తెలిపారు. కాపుల్లో పేదలు ఉన్నారు.. మిగతా వర్గాల్లోనూ ఉన్నారు. వీరంతా పైకి రావాలని, కాపులకు రిజర్వేషన్లు కల్పించడం తో పాటు వారి అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇదే తరుణంలో బీసీలకు ఎలాంటి నష్టం జరుగనివ్వబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాపులకు, బీసీలకు అన్యాయమే జరిగిందన్నారు. రాజకీయంగా తెలుగుదేశం పార్టీ ఈ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని సీట్లలోను టిడిపిని గెలిపించారని, ఈ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనదని, ఈ విషయంలో తాను దృఢ సంకల్పంతో ముందుకు సాగుతానన్నారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించామని, రేషన్ సరకులను ఎక్కడి నుండైనా పొందే అవకాశాన్ని అమలు చేశామన్నారు. రాష్ట్రంలో ఫించన్‌ల నిమిత్తం రూ.6 వేల కోట్లు, సబ్సిడీబియ్యం నిమిత్తం రూ. 4500 కోట్లు ఖర్చుపెడుతున్నామన్నారు. మహిళా గ్రూపులను ఆదుకునేందుకు రూ. 10వేల కోట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఇంతకు ముందు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సక్రమంగా అందేవి కావని, కాని తమ ప్రభుత్వ హయాంలో నెలవారి ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు.

విద్యుత్ సరఫరాలో మెరుగైన పద్ధతులను అవలంబించడం కారణంగానే ఇప్పుడు నిరంతరం విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని తెలిపారు. నూరు శాతం వంటగ్యాస్, సంపూర్ణ పారిశుధ్యం దిశగా వేగంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఏడాదికి 4 వేల కిలోమీటర్ల మేర సిమెంట్‌రోడ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి భరోసా ఇచ్చారు. సీలేరు నుంచి సాగునీరు డెల్టాకు అందిస్తున్నామంటే అది తెలుగుదేశం ప్రభుత్వం దూర ఆలోచనకు ఒక మచ్చుతునకగా అభివర్ణించారు. పట్టిసీమ విషయంలోనూ కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు.

ఎవరు అడ్డొచ్చినా రైతు అవసరాలు దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా పంట ఎండిపోకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## 1 నుంచి ఓటర్ల వివరాలు సేకరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దండె తదితర అధికారులు

**రాజధాని ప్రతినిధి - గుంటూరు :** మార్చి నెల 1 నుండి గుంటూరు నగర పరిధిలో నియోజకవర్గంలో ఓటర్ల వివరాలను సేకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ కార్యాలయపు అధికారులు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గత గురువారం హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు మాట్లాడారు. మార్చి 1 నుంచి 31లోగా పూర్తి చేయాలన్నారు. నెల రోజుల పాటు ఆయా బూత్ లెవెల్ అధికారులతో ఓటర్ల వివరాలను సేకరింపజేయాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించాలని చెప్పారు. జాబితాకు సంబంధించిన అభ్యంతరాలను, క్లెయింలను ఏప్రిల్ 11 నుండి 26 వరకూ స్వీకరించాలన్నారు. అనంతరం అభ్యంతరాలను, క్లెయింలను మే 6 వతేదీ నాటికి పరిష్కరించాలని సూచించారు. ఓటర్ల తుది జాబితాను మే 16న ప్రకటించాలని అధికారులు స్పష్టం చేశారు. ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించే సమయంలో ఇంటి నంబర్లను కూడా సరిచూసుకోవాలన్నారు. నంబరు లేని ఇళ్ళకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త నంబర్లను కేటాయించాలని కోరారు. ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసి సకాలంలో జాబితా విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ కాంతిలాల్ దండె మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి మరో 10 గ్రామాలు గుంటూరు నగర పరిధిలో కలిశాయని చెప్పారు. మొత్తం 524 పోలింగ్ స్టేషన్లు, దాదాపు 4,73,265 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వీరిలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 224 పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,92,747 మంది ఓటర్లు, పశ్చిమ నియోజకవర్గంలో 245 పోలింగ్ స్టేషన్లు పరిధిలో 2,22,209 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. విలీనమైన 10 గ్రామాలలో 55 పోలింగ్ స్టేషన్లు పరిధిలో 58,309 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. ఓటర్ల వివరాల సేకరణ, ముసాయిదా, తుది జాబితాల విడుదలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.


శ్రీ మహాశివ రాత్రి పర్వదిన మహోత్సవము

5-3-2016 నుండి 7-3-2016 వరకు

శ్రీ అన్న పూర్ణ దేవి సమితి
శ్రీ విశ్వేశ్వర స్వామి వార్ల అన్నాభిషేకము
మహశివ రాత్రి పర్వదినము సందర్భముగా శ్రీ శైవక్షేత్రంలో ప్రతిష్ఠ గావించబడిన శ్రీ అన్నపూర్ణదేవి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి వారికి తేది 7-3-2016 ఉ॥10 గం. లకు అన్నాభిషేక కార్యక్రమము జరుపబడును.భక్తులు స్వయంగా తమ స్వహస్తాలతో అన్నాభిషేకము జరుపుకొనవచ్చును

ఆలయ ప్రతిష్ఠ కుంభాబిషేకం
శ్రీ మహాశివరాత్రి పర్వదినమున తేది 7-3-2016 శ్రీ శైవక్షేత్రములో లింగోద్భవ (నిశీధి) కాలములో రాత్రి గం॥ 11.52 ని॥లకు శ్రీ అష్టభుజ దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ, శ్రీ కృష్ణవేణి మాతాజి చే హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మరియు కుంభాబిషేకం

అష్టదేవతా కళ్యాణ మహోత్సవము
1. శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ మహాగణపతి స్వామివార్ల కళ్యాణం
2. శ్రీ వల్లీదేవ సేన సమేత శ్రీ కుమారస్వామి వార్ల కళ్యాణం
3. శ్రీ భూసమేత శ్రీ విశ్వవెంకటేశ్వరస్వామివార్ల కళ్యాణం
4. శ్రీ రుక్మిణి దేవి సమేత శ్రీ కృష్ణస్వామివార్ల కళ్యాణం
5. శ్రీ సీతాదేవి సమేత శ్రీ రామచంద్రస్వామివార్ల కళ్యాణం
6. శ్రీ రాజ్యలక్ష్మీ చెంచుల సమేత శ్రీలక్ష్మీ నరసింహవార్ల కళ్యాణం
7. శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వార్ల కళ్యాణం
8. శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీకోటిలింగేశ్వరస్వామివార్ల దివ్య కళ్యాణం

శ్రీ పార్వతి పరమేశ్వరుల తెప్పోత్సవ కార్యక్రమము
తేది 8-3-2016 మంగళవారం సా॥గం॥ 5.05 ని॥లకు లోటస్ ఘాట్ నుండి దుర్గాఘట్ నదీ జలాలు వరకు పవిత్ర కృష్ణానదిలో శ్రీ రాజరాజేశ్వరి దేవి సమిత శ్రీ కోటి లింగేశ్వర స్వామి మంగళ వాయిద్యాలతో, వేద మంత్రఘోషతో అత్యద్భుత దీపకాంతులతో తెప్పోత్సవము జరుగును. కావున భక్తజనులు యావమ్మంది ఈ అమేయమైన పుణ్యోత్సవ కార్యక్రమములో పాల్గొని శ్రీ స్వామివార్ల తీర్థప్రసాదము స్వీకరించి తరించ గోరుచున్నాము కృష్ణానదిలో

తాళ్ళాయపాలెం, మందడం శివారు,
వెంకటపాలెం పోస్ట్, పిన్ - 522 503.
ఫోన్ : 0866-3297856
e-mail:srisaivakshetram@gmail.com
Facebook : sivaswamiji

శివస్వామిజీ

# రాజధాని వార్తలు

## అధికార దాసోహం చేస్తున్నవారిని ప్రజలు తిరస్కరించాలి

*నీతిమాలిన పార్టీ ఫిరాయింపు దారులను ప్రజలు తిరస్కరించాలి*

కొన్నేళ్ల క్రితం ఆచార్య నాగార్జునా వర్సిటీలో జిలానీ అనే విద్యార్థి హైజంప్‌ల చేసి విద్యా సంస్థకు మంచి పేరు సంపాదించేవారట, అది వర్సిటీ అంతటా పాకి ఎవరైనా అతని గురించి చెప్పుకోవాలంటే జంప్ జిలానీ అని చెప్పేవారట. అది ఎంతవరకు నిజమో తెలీదు కాని, రాజకీయాల్లో మాత్రం జంప్ జిలానీలు ఎక్కువైపోయారు. 2014లో జరిగిన ఎన్నికల ఫలితాలు రాగానే వైసీపీ నుంచి పోటీ చేసి గెలిచిన నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి చటుక్కున అధికార పార్టీలో చేరటంతో జనాలు అవాక్కై పోయారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పార్టీలో చేరాననడం మరో ముక్తాయింపు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గ సభ్యుడికి నిధులు కేటాయిస్తారు. వాటిలో అవినీతికి పాల్పడకుండా ప్రజలకు మేలు చేయవచ్చు. అధికార పార్టీ అవినీతికి పాల్పడితే ఎండగట్టవచ్చు. ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించవచ్చు. నిజానికి అధికారపక్షంపై వాచ్‌డాగ్‌లా ప్రతిపక్షం పనిచేసి ప్రజలకు దగ్గర కావొచ్చు. అంతేకాని అధికారం కోసం అంగలార్చడం, క్షణానికో పార్టీ మారడం కాదు చేయడం, దానితో అతనిపై ప్రజలకు విశ్వాసం పోతుంది. అంతేకాదు ఈ చర్యతోనే అవినీతికి పాల్పడుతున్నారన్న విషయం తేటతెల్లం అవుతుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఎన్టీఆర్ అధికారంలో ప్రతిపక్ష కాంగ్రెస్‌కు కేవలం పాతిక సీట్లు మాత్రమే వచ్చాయి. అయినా అప్పటిక ప్రతిపక్షనేత పీజే జనార్ధన్ రెడ్డి అధికార పక్షాన్ని దడ పుట్టించారు. అదే సమయంలో ఎన్టీఆర్ కూడా వారిని పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించలేదు. మొన్నటికి మొన్న వైసీపీ పార్టీలోని క్యాబినెట్ హోదాగల పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్, నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి తన కూతురు అఖిలప్రియ(ఆళ్లగడ్డ)తో సహా మరో నలుగురు ఎమ్మెల్యేలు ఆదినారాయణ, (జమ్మలమడుగు) జలీల్‌ఖాన్ విజయవాడ పశ్చిమ)లు పార్టీలు మారారు. రెండోరోజు మరో ఎమ్మెల్యే....రాజకీయాలు ఎంతగా దిగజారిపోయాయో తెలుస్తోంది. ఒక పార్టీ గుర్తుతో గెలిచి మరో పార్టీలో ఎలా చేరుతున్నారు.. వీరంతా ప్రజలకు రేపు ఏమని సమాధానం చెప్పుకుంటారు. కేసీఆర్ కూడా అంతే.. తెలంగాణలో ప్రతిపక్షం అనేది లేకుండా చేశారు. అందరినీ టీఆర్ఎస్‌లోకి తీసుకెళ్లిపోయారు. ఇప్పుడక్కడ ప్రతిపక్షం అంటే కేవలం కాంగ్రెస్‌లోని అతితక్కువ సభ్యులు మాత్రమే ...అంతగా తెలుగుదేశం పార్టీని టీఆర్ఎస్ దెబ్బతీసింది. అలాంటి పరిస్థితుల్లో చంద్రబాబునాయుడు ఎంతగా తల్లడిల్లిపోయారు. ఆ సంగతులు ఆయన్ను ఎంతగా బాధించి ఉంటాయి. కాని ఆయన రూటే సెపరేటు కాబట్టి తన రాష్ట్రంలో మళ్లీ 'ఆకర్షక' మంత్రం కింద ప్రత్యర్థి పార్టీలోని సభ్యులనందరికీ గాలం వేస్తున్నారు. నారా లోకేష్ అయితే ఒక అడుగు ముందుకు వేసి రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేస్తామన్నారు. అది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం, చట్ట విరుద్ధంగా మాట్లాడుతున్నాం అనే స్పృహ లేకుండా మాట్లాడటం సబబు కాదు. ప్రజా సమస్యలను నుంచి పక్కకు తప్పుకొని, ప్రజలను పక్కదారి పట్టించడం కోసమే అధికార పక్షం వలసలను ప్రోత్సహిస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ రోజు పార్టీ మారిన వారంతా డబ్బు, పదవి, అధికారానికి దాసోహం అంటూ నైతిక విలువలకు సమాధి కట్టి, ప్రజాస్వామ్య స్ఫూర్తికే తిలోదకా లిస్తున్నవారే...ఒక పార్టీపై ప్రజలు ఎన్నుకుంటే మరో పార్టీలోకి జంప్ చేయడం ఎంత నీతిమాలిన పనో వారికి తెలిసేలా ప్రజలు వారికి బుద్ధిచెప్పాలి. ఒకే పార్టీలో కనీసం ఐదేళ్లు ఉండేలా నియమనిబంధనలను కఠినతరం చేయాలి. రాజకీయ మేధావులు ఈ పరిస్థితిని సరిదిద్దే చర్యలు సత్వరమే చేపట్టాలి.

## తుర్లపాటీయం

అప్పుడది ఆయా వ్యక్తుల పరిచయాల శీర్షిక మాత్రమే ! ఇప్పుడో ? అదొక రాజకీయ వ్యాఖ్యగా పరిణతి చెందింది. ఆశీర్షిక అభిమానులలో సామాన్యుల దగ్గరి నుంచి అసామాన్యులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికార ప్రముఖులు, ఐ.ఏ.ఎస్. అధికారులు ఉన్నారు. నాకు తెలిసి, చాలా మందికి తెలియని కొత్త విశేషాన్ని ఆ శీర్షిక చెప్పడమే దాని ప్రత్యేకత. ఒక్క మాటలో చెప్పవలెనంటే, నాకు "పద్మశ్రీ" అవార్డు రావడానికి కూడా ఆ శీర్షిక పాత్ర కూడా లేక పోలేదు. రాష్ట్రపతి "పద్మశ్రీ" అవార్డు ప్రదానం సమయంలో నాకు ప్రసాదించిన ప్రశంసా పత్రంలో ఆ శీర్షిక పేరు లేకపోయినా, పరోక్షంగా దాని ప్రస్తావన ఉండడమే ఆ శీర్షిక విశిష్టతకు నిదర్శనం !

**తెలుగుతో నా తాదాత్మ్యం**

నా పాత్రికేయ జీవిత ప్రారంభమే తెలుగు భష , తెలుగు రాష్ట్ర నిర్మాణ ఆవశ్యకతలలో ఆరంభమైనది. ఇంతకు పూర్వమే పేర్కొన్నట్లు, నా తొలి వ్యాసం "స్వరాజ్యంలో స్వరాష్ట్ర". ముక్కోటి ఆంధ్రులు ఒక్క రాష్ట్రంలో ఉంటే , తెలుగు జాతికి, తెలుగు భాషకు జవం, జీవం వికసించ గలవని నా విశ్వాసం. అప్పటి నుంచి తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎక్కడ ఎవరి నుంచి ఏ పాటి అపచారం జరిగినా, నా కలం, గళాలు విప్పారేవి. "రాజాజీ- తెలుగు భాషకు గార్డియన్" బిరుదు ఉదంతం ఇది వరకే పేర్కొన్నాను.

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ముందు, అంతకు పూర్వం సమష్టి మద్రాసు రాష్ట్రంలో తక్కిన ఆంధ్ర జిల్లాలతో పాటు ఉన్న బళ్లారి జిల్లా, బళ్లారి భవితవ్యాన్ని గురించి, ముఖ్యంగా ఆ నగరం ఏ రాష్ట్రంలో ఉండాలనేదానిపై రెఫరెండం తీసుకోవాల నిర్ణయించారు.

బళ్లారి పట్టణంలో తెలుగు మాట్లాడే వారే అధిక సంఖ్యాకులనడం నిర్వివాదం. అప్పటిలో బళ్లారి మునిసిపల్ చైర్మన్ ఆంధ్రుడైన శ్రీ ముండ్లూరి గంగప్ప ! ఆ రెఫరెండంలో బళ్లారిని ఆంధ్ర రాష్ట్రంలో కలపాలన్న ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న శ్రీ గంగప్పకు తోడ్పాటుగా నేను అప్పుడు ఉంటున్న గన్నవరంలో కొంత మొత్తాన్ని విరాళాల ద్వారా వసూలు చేసి పంపాను.

**కింగ్ మేకర్ కామరాజ్ :**

అలాగే చిత్తూరు జిల్లాలోని తిరుత్తణిని (డాక్టర్ సర్వేపలి రాధాకృష్ణన్ స్వస్థలం), తిరుపతిని తమిళనాడులో కలుపుకోవాలని తమిళులు ప్రయత్నిస్తుండగా, ఆ ప్రయత్నానికి నాయకత్వం వహిస్తున్న తమిళ నాయకుడు శ్రీ కామరాజ్ నాడార్‌ను, ఆయన వాదాన్ని విమర్శిస్తూ తెలుగు పత్రికలలో కొన్ని వ్యాసాలు, "హిందూ", " ఇండియన్ ఎక్స్ ప్రెస్" పత్రికలలో సంపాదక లేఖలు రాశాను.

తిరుపతి, తిరుత్తణిల పేర్లలో "తిరు" అన్నది తమిళనామమని, తిరుచినా పల్లి, తిరుచెంగోడ్, తిరువాయూర్ మొదలైన తమిళ ప్రాంతాలవలెనే తిరుపతి, తిరుత్తణి కూడా తమిళ ప్రాంతాలని కామరాజ్ కుతర్కం! "అలా అయితే, కృష్ణాజిల్లా మధ్యలో ఉన్న "తిరు"వూరు కూడా మీదే కాబట్టి , దాన్ని పెల్లగించుకుపోతారు?" అని ఒక లేఖలో శ్రీ కామరాజ్‌ను ప్రశ్నించాను! ఆయన నుంచి ఏమి సమధానం వస్తుంది.?

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం తరువాత 1964లో భువనేశ్వర్ కాంగ్రెసు మహాసభకు అధ్యక్షత వహించడానికి విజయవాడ మీదుగా వెళుతున్న కామరాజ్ స్పెషల్ ట్రెయిన్ విజయవాడలో ఆగినప్పుడు ఒక ప్రముఖుడు నన్ను ఆయనకు పరిచయం చేశారు. నేను "తిరు" ఉదాహరణలను, నా లేఖను ఆయనకు జ్ఞాపకం చేశాను.

కామరాజ్ జ్ఞాపక శక్తి గొప్పది. అయిదవ తరగతి వరకే చదివినా, ఆయన మద్రాసు ముఖ్యమంత్రి పదవిని అలంకరించి, పండిట్ నెహ్రూ హయాంలోనే ఆయన కోర్కెపై అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడై, రెండు సార్లు కేంద్రంలో ప్రధాన మంత్రి పదవి ఖాళీ అయినప్పుడు రెండు సార్లూ ప్రధానులను నిర్ణయించి, "కింగ్ మేకర్"గా పేరు పొందాడు.

నేను"తిరు" పట్టణాల ఉదంతాన్ని పేర్కొనగానే ఎప్పుడూ గంభీరంగా ఉండే ఆయన ముఖంలో చిరునవ్వు తొంగి చూసింది. " ఔను! జ్ఞాపకముంది!" అంటూ ఆయన నా భుజం తట్టారు. ఆ పట్టణం కర్నాటకలో కలిసిపోయింది. కాగా, కేంద్ర న్యాయశాఖా మంత్రిగా పనిచేసిన శ్రీ హెచ్.వి.పటాస్కర్ అవార్డు ప్రకారం తిరుత్తణిని తమిళనాడులో కలిపారు.ఆ ఏడుకొండలవాడి దయవల్ల తిరుపతి మాత్రం తెలుగువారికి దక్కింది !

**రాధాకృష్ణన్ ఔదార్యం**

"మీ జన్మ స్థలమైన తిరుత్తణిని తమిళులు కలిపి వేసుకుంటే, మీరెందుకు వూరుకున్నా"రని అప్పటి భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రశ్నించగా,"తిరుత్తణి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నా, తమిళనాడులో ఉన్నా భారతదేశంలోనే ఉంది కదా!"అని ఆయన నాకు ప్రత్యుత్తరమిచ్చారు !

**తెలుగుకు ప్రాచీన అధికార భాషా ప్రతిపత్తి:**

2003 మే 9వ తేదీన తమిళనాయకులు మూకుమ్మడిగా, ఉన్నట్టుండి ఒక బాంబు పేల్చారు !తమిళ భాష భారతీయ భాషలలో అతిప్రాచీనమైనదట! కావచ్చు, అందువల్ల, ఆ భాషకు ప్రాచీన భాషా ప్రతిపత్తి యివ్వవలెనట! అంతవరకైతే ఫర్వాలేదు. తమ తమిళ భాషను దేశ స్థాయిలో హిందీ తరువాత రెండవ అధికార భాష చేయాలట! అందుకు అన్ని విధాల అర్హతలు తమ భాషకే ఉన్నవట!



ఈ కోర్కెలతో 2003 మే9వ తేదీన తమిళ రాజకీయ పక్షాల నాయకులందరు అప్పటి కేంద్రమంత్రి శ్రీటి.ఆర్.బాబు నాయకత్వాన ఆనాటి భారత ప్రధాని శ్రీ వాజ్ పేయిని కలిసి ఒక మెమోరాండం సమర్పిచారు. ఈ వార్త 2003 మే 10వ తేదీన"హిందూ" దినపత్రికలో ప్రచురించబడింది. ఈ వార్త చూచిన వెంటనే నేను తీవ్రంగా ప్రతిస్పందించాను.వెటనే ప్రధాని వాజ్‌పేయికి సుదీర్ఘమైన టెలిగ్రామ్ పంపించాను. తమిళానికి ప్రాచీన భాషా ప్రతిపత్తి యివ్వడానికి ఎవ్వరికీ అభ్యంతరం ఉండనక్కరలేదని, అయితే, ఆ అర్హతకు తగిన ప్రాచీనత, భాషాపరిపుష్టి, చరిత్ర తెలుగు భాషకు కలవని, వీటిలో తెలుగు ఏ భాషకు తీసిపోదని పేర్కొన్నాను.

చాంద్రమానేన శ్రీ మన్మథనామ సంవత్సరం

## నాడీ జ్యోతిష్యం

2016 ఫిబ్రవరి 28 నుంచి 5 మార్చి వరకు

అన్ని రాశులవారు వయస్సు బట్టి చూసుకోవాలి

ఆకుల వేణునాథ్ సిద్ధాంతి, cell : 9032450197

1. 7,5,13 సం.. వయస్సువారు విద్యాభ్యాసం మందకొడిగా, నిదానంగా అవసరమైన విద్యా కాకుండా అనవసరమైన విద్యలపై మనసు కలుగుట. బాలికలకు సంగీత నాట్యం, లలిత కళలు మీద ఆసక్తి కలిగించుకొనుట ప్రధాన విద్య బలహీనంపడుట. ఎంత ప్రయత్నించినా మనసు పరిపరివిధాలుగా పరుగెత్తుట. శనికి శాంతి చేయుంచటం మరియు దక్షిణామూర్తి పూజ చేయడం మంచిది.

2.14 నుండి 20 సం...వయస్సు వారు విద్యాభ్యాసముకంటే ధనము సంపాదించటం గురించి కుటుంబ బాధ్యత వ్యవస్థల మీద అవగాహనా ఆలోచనలు తోబుట్టువుల కోసం అంతర్గత ఆందోళన ఆతురత, అభివృద్ధి మీద ఆకాంక్ష కొన్ని సందర్భాలలో వివాహాశుభ కార్యములు జరుగును. గృహ అలంకరణలకు ధనము ఖర్చు అగుట మొత్తం మీద శుభ కార్యములు జరుగును.

3.20 నుండి 26 సం.. వయసువారికి శత్రు, రుణ, రోగభయాలు లేకుండా తల్లీ తండ్రి ఆర్థిక విషయంలో బంధుమిత్ర సోదరీమణులు అందరూ కలిసి ఆలోచనలు చేయుట, తల్లీ తండ్రుల విషయంలో ఆరోగ్య సమస్యలు గురించి ఆలోచనలు కొంతమందికి వివాహ శుభకార్యాలు చేయుట దాని ములక అంతర్గిత: అనేక టెక్షన్‌లకు గురియగుట అనేక శుభ కార్యాలు జరుగును.

4.27 నుండి 33 సం.. వయస్సు వారికి శత్రు, రుణ, రోగభయాలు లేకుండా వివాహాది శుభధర్మ కార్యాచరణలు స్త్రీలు గృహ అలంకరణలకు రోజురోజుకూ ఒక విధంగా లగ్జరీ మెయిన్‌టెన్స్ బంధుమిత్రులకు సలహాలు ఖర్చుచేయుట అనేక కార్యక్రమాలలో ఆందోళన, అతూరతతో మాటలతో చలామణి అగుట మహారాణిలాగా ప్రవర్తించెదరు. అంతర్గత: చిత్రకళాభిరుచి.

5. 34 నుండి 39 సం.. వయస్సు స్త్రీలు , కుటుంబవ్యవస్థలో అందరినీ సమస్యలతో తలమునకలు అగుట, అన్ని రకముల సదుపాయలు ఉన్న వినియోగించుకునే అవకాశాలు అందరూ మిత్రులే శత్రువులే అనేక అలోచనలతో సతమతం అగుట స్త్రీలు అంతర్గత: ాంతరంగిత సలహా కార్యనిర్వహణలతో కుటుంబవ్యవస్థను రక్షించి క్రమశిక్షణ కార్యనిర్వహణ చేయుట.

6.40 నుండి 46 సం. వయస్సు వారికి శారీరక మానసిక బలహీనతలు ఉన్నప్పటకీ ఆత్మస్థైర్యంతో నిగ్రహంతో జీవనపోరాటం చేసి ఒక్కరకము లేదు అన్ని విధాలుగా జీవనపోరాటం చివరకు జీవితం అంటే భయంగా అనిపించుట జీవన రంగ స్థలపోరాటం ఇంత గొప్పగా ఉంటుందా. జీవితా అనుభవాలతో ప్రతి విషయం ఆచితూచి అడిగి శుభదర్మ కార్య ఆచరణాలు చేయుట.

7. 47 నుంచి 52 సం.. వయస్సు వారికి సంతాన విషయాలలో చికాకులు, పిల్లలు జీవితం కోల్పోతారన్న ఆందోళనతో జాగ్రత్తలు సలహా సంప్రదింపులు. మొండితనం డైరెక్టర్ మాట చలామణితో కుటుంబ వ్యవస్థను కాపాడుకొనుట. గృహ అలంకరణకు ఖర్చులు అంతర్గిత: తల్లి తండ్రులు ఆర్థిక అన్ని విషయాలు వ్యవహారాలతో తలమునకు అగుట స్త్రీలు ప్రధాన పాత్ర పోషించుట.

8.53 నుండి 58 సం... వయస్సు వారికి సర్వ రంగ వ్యవస్థలు బంధుమిత్ర సపరివార అందరి గురించి ఆలోచించి తలమునక అగుట. జీవన పోరాటంతో ఒక వింత శైలి. కొత్త అనుభవాలు స్ఫూర్తి వింతవింత ప్రవర్తనలతో తనను తాను నిలబెట్టుకొని తాను అందరినీ నిలబెట్టుకొనుట. అంతర్గిత: స్త్రీలు ప్రధాన పాత్ర పోషించి శుభకార్యాచరణాలు చేయుట మంచిది.

9.59 నుండి 65 సం.. వయస్సు వారికి అందరినీ కోల్పోయినట్లు భావన. ఏక్ నిరంజన్ అన్నట్లు తాతా, మేనత్త, మేనమామలు వారి జీవితానుభావాలు గుర్తుకొచ్చుట. దైవభక్తి ఉపాసన బలంతో జీవితగమనం గుర్తుకొచ్చుట. బాల్య వ్యవస్థ తన దగ్గర ఉన్న వారితో అనుభవాలు పంచుకొనుట. చిన్నవారికి హితవు చెప్పుట సరియైన జీవితమార్గ గమనమును తెలియపరుచుట జరుగును.

10.65 నుండి 72 సం... వయస్సు వారికి శత్రు క్షేత్రంతో ఉన్నట్లు భావన. మొండితనంతో పట్టుదలతో మాటల గారడీ చేసి స్త్రీలు, తల్లి , భార్య బలం తీసుకుని దైవభక్తి క్రియలు చేసి ఎట్టకేలకు దినాదినాభివృద్ధి లోపాలు, సమర్థించుకుంటూ ఆత్మస్థైర్యంతో జీవితగమనం చేయుట. మాట చలామణితో సర్వకార్యాలు చేయుంచుకొనుట స్త్రీలు సహకారం లభించుట అంతయు శుభము అనిపించుకొనుట.

## సీఎంకు కాపు నేతల కృతజ్ఞతలు



**రాజధాని వార్తలు -ఏలూరు :** కాపు రుణమేళా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పలువురు నగర ప్రముఖులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా తమతమ రంగాలలో చేస్తున్న అభివృద్ధి పనులను గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఏలూరు నగర పాలక సంస్థ 17వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ దాకారపు రాజేశ్వరరావు, టిడిపి నగర ఉపాధ్యక్షుడు ఆర్ఎన్ఆర్ నాగేశ్వర రావు, చంద్రాబాబునాయుడుకి పుష్పగుచ్ఛం అందించి రుణాలు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ఆర్ఎన్ఆర్ సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.




## రూ.1 కోటి 50 లక్షలతో చాటపర్రులో అభివృద్ధి పనులు

**మాజీ జెడ్పీటీసీ గుత్తా కాశిబాబు**

రాజధాని వార్తలు-ఏలూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని చాటపర్రు గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ గుత్తా కాశిబాబు చెప్పారు. గ్రామంలో రూ. కోటి 50 లక్షలుతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, ఏలూరు పార్లమెంట్ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), రాజమండ్రి పార్లమెంట్ సభ్యుడు మాగంటి మురళీ మోహన్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సి.హెచ్ అయ్యన్న పాత్రుడు గామాన్ని దత్తత తీసుకున్న తానా అధ్యక్షులు, గుంటూరు జిల్లాకు చెందిన జంపాల చౌదరిల దృష్టికి తీసుకువెళి అభివృద్ధి పనులకు నిధులు సమీకరించి గ్రామ అభివృద్ధికికి కాశిబాబు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన రాజధాని వార్తలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2015 జనవరి 1న చాటపర్రు గ్రామానికి విచ్చేసి అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఈ నిధులతో గ్రామస్తులను చిరకాలంగా వేధిస్తున్న తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కారానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలోని 9 కిలోమీటర్ల మేర రోడ్లన్నింటినీ మెటల్ సీసీ రోడ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో రోడ్ల నిర్మాణానికి అన్ని రోడ్లకు ప్రస్తుతం గ్రావెల్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటికి అదనంగా 13వ, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షలతో తిమ్మారిగూడెంలో సీసీ రోడ్ నిర్మాణం పూర్తయిందన్నారు. 2015 -16 సార్వా పంటకు నీరందించే విషయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపి మాగంటి బాబు, జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌ల సహకారంతో కృష్ణా ఆయకట్టు ద్వారా గోదావరి జలాలు సముద్రంలో కలువకుండా రైతాంగానికి అందించడంతో రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. ఆఖరి తూములో ఉన్న చాటపర్రు ఆయకట్టు గుండా మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, కొమడవోలు, పాలగూడెం, మిగిలిన గ్రామాలకు కూడా సీతంపేట కాలువ ద్వారా నీరందించే విషయంలో ఎమ్మెల్యే, ఎంపీలు చొరవచూపడం జరిగిందన్నారు. నేడు శివారు గ్రామాలకు చాటపర్రు గ్రామం నుండి వెళ్లే కాలువలు ద్వారా పెదపాడు మండలంలోని వట్లూరు వరకు రైతాంగానికి నీరందించామన్నారు. సుమారు రూ.60 లక్షల రూపాయలతో ఏలూరు తూర్పులాకుల వద్ద మోటార్లు బిగించి పంపింగ్ స్కీం బిగించి శివారు గ్రామాలకు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందనను కొనియాడారు. గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలోనూ గ్రామ సర్పంచ్ దొడ్డిగర్ల భాగ్యశ్రీ,ఉపసర్పంచ్ మూల్పూరి విజయతులసీరాణి, జన్మభూమి కమిటీ సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ మట్టా రాజేశ్వరి, నీటి సంఘం అధ్యక్షులు, గ్రామ పెద్దలు, ప్రజలు అందరినీ కలుపుకుని వారి సహకారంతో ఈ అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నట్లు కాశిబాబు వివరించారు. ఇటీవల జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలోని ప్రతి ఇంటిలోని మహిళలకు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు అందజేసి గ్రామంలో ఎవరూ కూడా కట్టే పుల్లతో వంట చేయకూడదనే విధంగా వారికి గ్యాస్ కనెక్షన్‌లు అందించడం జరుగుతొందన్నారు. గ్రామ ప్రజలకు ఇప్పటి వరకు 200 వరకు రేషన్ కార్డులు అందజేశామని,ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా అందజేస్తామన్నారు.



కాశిబాబు



గ్రామ పంచాయతీ కార్యాలయం



గ్రామంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

# మార్చి 8 నుంచి గర్భిణులకు ఉచిత స్కానింగ్

- ప్రజారోగ్య విధానంలో రాష్ట్రం దేశానికే ఆదర్శం,
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్

**రాజధాని ప్రతినిధి :** ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు మార్చి 8 నుంచి ఉచితంగా స్కానింగ్ పరీక్షలతో పాటు, ప్రధాన ప్రభుత్వా సుపత్రుల్లో సిటీ స్కానింగ్, రేడియాలజీ విభాగాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. ప్రజారోగ్య విభాగంలో రాష్ట్రంలో చేపడుతున్న విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, వీటిపై కేంద్రం నుంచి ప్రశంసలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరించిన అత్యవసర చికిత్స విభాగాన్ని గత శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన దాతలు కే విజయబాబు, శివరామ ప్రసాదు అత్యవసర చికిత్సా విభాగాల్లో 12 పడకలను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి కామినేని మాట్లాడుతూ ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్నా మెరుగైన సేవలందించడం ప్రశంసనీయ మన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో మరింతగా సేవలందించేందుకు కాంట్రాక్టు పద్ధతిలో వెయ్యి నర్సింగ్ పోస్టులు, 500 వైద్యుల పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విశాఖపట్నం కేంద్రంలో ప్రత్యేక వైద్య పరికరాల యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యూ.సూర్యకుమారి, డాక్టర్లు ఆర్ గీతాంజలి, నరసింహనాయక్, ఐ రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డీ ఉమామ హేశ్వరరావు పాల్గొన్నారు. డైటీషియన్స్, న్యూట్రీషియన్స్ సేవలు ఉపయోగించుకుం టామని, వ్యాధుల నియంత్రణ కు డైటీషి యన్స్ కృషి చేయాలని మంత్రి కామినేని శ్రీనివాస్ సూచించారు. విజయవాడ డయా బెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూట్రివ జన్ పేరుతో శనివారం రాష్ట్ర స్థాయి సదస్సును స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులోని హోటల్ డీవీ మానర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాటాడుతూ న్యూట్రీషియన్లు, డైటీషియన్ల సేవలు ప్రభుత్వ పరంగా ఉపయోగించుకుంటామన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టీ రవిరాజ్ మాట్లాడుతూ సమాజంలో న్యూట్రిషయన్స్, డైటీషియన్స్ సేవలు మరింత విస్తరించారు. ఈ సందర్భం గా లైఫ్ స్టైల్ డీసీజెస్‌పై పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల మెడికల్ ప్రొఫెసర్ డాక్టర్ జీ.ఈశ్వర్, బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ దుక్కిపాటి నందకిశోర్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ యలమంచలి రాజారావు, జాతీయ పోషకాహార సంస్థ సీనియర్ సైంటిస్టు డాక్టర్ కే.భాస్కరాచారి పలు అంశాలపై ప్రసంగించారు. విజయవాడ డైటటిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డీ. హేమదేవి, సదస్సు ఆర్గ నైజింగ్ సెక్రటరీ జీ స్వరూపలతో పాటు, వివిధ జిల్లాల డైటిషియన్స్, న్యూట్రిషియన్స్ పాల్గొన్నారు.

## 160 నర్సింగ్ పోస్టులకు 7,987 దరఖాస్తులు

**రాజధాని. ప్రతినిధి - గుంటూరు :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 160 నర్సింగ్ సిబ్బంది పోస్టులకు ప్రభుత్వం ఈ నెల 5 నోటిఫికేషన్ విడుదల చేయగా 7,987 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్క్రూటినీ కార్యక్రమాన్ని ఆస్పత్రి అధికారులు ప్రారంభించారు. ఫిబ్రవరి 27న మెరిట్‌జాబితాను విడుదల చేస్తారు. మెరిట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించి 29న ఉద్యోగ నియామకపత్రాలను అందజేస్తారు. మార్చి 1న నూతనంగా రిక్రూట్ అయిన నర్సింగ్ సిబ్బంది విధుల్లో చేరతారు. సుమారు ఆరేళ్ళ తర్వాత పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అవ్వటంతో ఎలాగైనా ఉద్యోగాన్ని దక్కించుకోవాలనే ప్రయత్నంలో పలువురు అభ్యర్థులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆస్పత్రి అధికారులు మాత్రం ఎలాంటి రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు లేకుండా కేవలం ప్రతిభ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు ఇస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని వెల్లడించారు.

## గుంతలుపడిన రోడ్లను పూడ్చేదెప్పుడు?

**రాజధాని ప్రతినిధి :** తుళ్ళూరు - వడ్డమాను రోడ్డు గుంతమయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. తుళ్ళూరు నుంచి వడ్డమానుతో పాటు అమరావతి వెళ్ళేందుకు ఈ మార్గం అనుకూలంగా ఉంటుంది. ఇటీవల రాకపోకలు కూడా బాగా పెరిగాయి. భారీ వాహనాలు సైతం తిరుగుతున్నాయి. దీంతో తారు రోడ్డుకు అనేక చోట్ల గుంతలు పడ్డాయి. వడ్డమాను, అనంతవరం నుంచి మండల కేంద్రమైన తుళ్ళూరుకు వివిధ పనులపై జనం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు అనేక మంది ఈ రోడ్డుపై వాకింగ్, రన్నింగ్‌కు కూడా వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో అసౌకర్యంగా ఉంటోందని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పదించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## గోదావరి పుష్కర తొక్కిసలాట విచారణ మార్చి 21కి బదిలీ

**రాజధాని ప్రతినిధి :** గోదావరి మహాపుష్కరాల ప్రారంభం సందర్భంగా తొలిరోజున జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ మంగళవారం రాజమహేంద్రవరంలో విచారణ చేపట్టింది. జస్టిస్ సి.వై సోమయాజులు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ ఎదుట వాదనలు వినిపించి తొలి ప్రమాణ పత్రం దాఖలు చేసిన ముప్పాల సుబ్బారావు. వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మీతో పాటు మరికొందరు సాక్ష్యం చెప్పేందుకు ముందుకువచ్చారు. అఫిడవిట్లు సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని వారు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన జస్టిస్ సోమయాజులు ఇప్పటికే గడువు ఎక్కువగా ఇచ్చామని, మార్చి 5లోపు ఎవరైనా ముందుకు వచ్చి ప్రమాణ పత్రాలు సమర్పిస్తే స్వీకరిస్తామని తెలిపారు. తమకు మార్చి19 వరకు అవకాశం ఇవ్వాలని జిల్లా యంత్రాంగం నియమించిన న్యాయవాది సి.హెచ్. ప్రభాకరరావు విన్నవించడంతో ఆయనకు 19 వరకు గడువిస్తూ మార్చి 21వ తేదీకి విచారణను వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సోమయాజులు ప్రకటించారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్షిక బ్రహోత్సవాలకు ఆహ్వానం

**రాజధాని ప్రతినిధి :** చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్షిక బ్రహోత్సవాలు అద్భుతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులు, ధర్మకర్తల మండలికి మర్గనిర్దేశం చేశారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్యానాయుడు, ఈవో భ్రమరాంబల సమక్షంలో ముఖ్యమంత్రి మంగళవారం విజయవాడలో బ్రహ్మోత్సవ గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. రెండో తేదీ భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయి. మార్చి 7న మహాశివరాత్రి సందర్భంగా నంది, సింహ వాహన సేవలు, అదే రోజు రాత్రి లింగోద్భవం, 8న ఉదయం రథోత్సవం నిర్వహిస్తారు. 9న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

# ఆన్‌లైన్లో డీఎడ్ ప్రవేశ పరీక్ష

– జీమాట్ తరహాలో ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ



**రాజధాని ప్రతినిధి :** డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్ (డీఎడ్) కోర్సులో ప్రవేశానికి సంబంధించిన డీసెట్‌ను వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్లోనే నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకు డీసెట్‌లో దరఖాస్తుల స్వీకరణ, హాల్‌టిక్కెట్ల జారీ మాత్రమే ఆన్‌లైన్లో నిర్వహిస్తున్నారు. పరీక్షలను రాత (ఓఎమ్మార్) పద్ధతిలో నిర్వహిస్తారు. కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జీమ్యాట్ (గ్రాడ్యుయేట్ మేనేజ్ మెంటు టెస్టు)ను పూర్తిగా ఆన్‌లైన్లోనే నిర్వహిస్తోంది. అలాగే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ)ని ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్లో కూడా నిర్వహిస్తోంది. ఆ తరహాలోనే డీసెట్‌ను రాష్ట్రంలో పూర్తిగా ఆన్‌లైన్లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇటీవల ఇందుకు సంబంధించి సాంకేతిక అంశాలపై పాఠశాల విద్యాశాఖ నిర్ణయించాలని, ఇటీవల ఇందుకు సంబంధించి సాంకేతిక అంశాలపై పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఆర్పీ సిసోడియా, డీసెట్ చైర్మన్, కమిషనర్ సంధ్యారాణి నిపుణులతో చర్చించారు. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ వల్ల సకాలంలో ఫలితాల విడుదలకు అవకాశం ఉండడంతో పాటు ఓఎమ్మార్ పత్రాలతో పరీక్ష నిర్వహించడం ద్వారా తలెత్తే సమస్యలు తొలిగిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

అందుబాటులో ఆన్‌లైన్ సెంటర్లు జీమ్యాట్‌తో సహా పలు పరీక్షల కేంద్రాలు ఏర్పాటై ఉన్నాయి. డీసెట్ కోసం ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని భావిస్తున్నారు. డీసెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించే ముందు అభ్యర్థులకు దానిపై అవగాహన కల్పించడానికి నమూనా పరీక్షలు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. ఈ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించే నామమాత్రపు ఫీజును చెల్లించివారు ఈ నమూనా పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు. షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత నిర్ణీత తేదీల్లో అభ్యర్థులకు స్లాట్ కేటాయిస్తామని, అభ్యర్థి తేదీల్లో తాను ఎంచుకున్న కేంద్రానికి వెళ్లి పరీక్ష రాయవచ్చని వివరించారు. నిర్ణీత సమయంలోగా అభ్యర్థులు ఆన్‌లైన్లో సమాధానాలను గుర్తించాలని, సమయం పూర్తవ్వగానే స్లాట్ తనంతట తానుగా ముగుస్తుందని తెలిపారు. ఈ విధానం వల్ల పరీక్షలో పారదర్శకత, ఫలితాలు త్వరగా వెల్లడించడానికి వీలవుతుందన్నారు.

## పక్కా ప్రణాళికతో రండి

చైనా బృందానికి గుంటూరు కలెక్టర్

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** నగరంలో ఈ ఏడాది 10 వేల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సీనంజ్ ప్రాజెక్టుపై సమగ్ర ప్రణాళికలతో రావాలని కలెక్టర్ బాబు.ఎ చైనా బృందాన్ని కోరారు. నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో చైనా బృందంతో ఆయన భేటీ అయ్యారు. మున్సిపల్ కమిషనర్ జీ వీరపాండ్యన్, చైనాకు చెందిన జీఐసీ ముఖ్య కార్యదర్శి జిహాంగ్ జోహెతో కలిసి కలెక్టర్ ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాబు.ఎ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది పట్టణ ప్రాంతంలో 10వేల గృహాలు, గ్రామీణ ప్రాంతాల్లో 15 వేల వక్తిగత గృహాలను నిర్మిచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే టెండర్ ప్రక్రియ ద్వారా ఆయా నిర్మాణాల్లో భాగస్వామ్యం కావచ్చని, నగరంలో జీ+ తరహాలో భవనాల నిర్మాణానికి చొరవ చూపుతున్నామన్నారు. నగరంలో మురుగు కాలువలపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. నగరంలో 150 ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్‌ప్లాంట్ నిర్మినున్నట్లు వెల్లడించారు. మార్చినాటికి 60 ఎంఎల్‌డీల వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకు వస్తున్నామని తెలిపారు. నగరంలో భవన నిర్మాణాలు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలిచాలని చైనా బృందాన్ని కోరారు. ఎకరాకు 260లకుపైగా ఇళ్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

## 10న కలెక్టరేట్‌ల ముట్టడి

- జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

**రాజధాని ప్రతినిది, విజయవాడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరశిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మార్చి 10వ తేదీ ఏపీలో అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. గత శుక్రవారం విజయవాడలో ఆల్ ట్రేడ్ యూనియన్ల నేతలు సమావేశమయ్యారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, ఐఎన్‌టీయూసీ నాయకులు బి.వెంకట సుబ్బయ్య, సీఐటీయూ కార్యదర్శులు పి.అజయ్‌కుమార్, ఏవీ నాగేశ్వరరావు, టీయూసీసీ నాయకులు పీవీ సుందర రామరాజు, ఐఎఫ్‌టీయూ అధ్యక్షులు పోలారి, వైఎస్‌ఆర్‌టీయూ అధ్యక్షులు పి.గౌతంరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణమూర్తి, రమణమూర్తి పాల్గొ న్నారు. దేశవ్యాప్తంగా కార్మికులకు రూ.15 వేలు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పిం చాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో పనిచేస్తున్న వారందరినీ వర్కర్లుగా గుర్తించి వారికి కనీస వేతనాలు, సామా జిక భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలి, నిత్యావసరం ధరలు అదుపు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలు ఉపసంహారించి దేశానికి నష్టం కల్గించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆపాలని, రాష్ట్రంలో మూసివేసిన పరి శ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కొనసాగించాలని తదితర డిమాండ్లపై చేపట్టే కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## భారత్‌లో లౌకికతత్వం దెబ్బతింటోంది

– అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన

న్యూఢిల్లీ : మత హింస ఘటనలను నిరోధించడంలో భారత అధికారులు విఫలమవుతున్నారని, ప్రజల మధ్య విద్వేషం రగిల్చే ప్రసంగాలు ఉద్రిక్తలకు దారితీస్తున్నాయని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దేశంలో అసహనం పెరగడాన్ని లండన్‌కు చెందిన ఈ అంతర్జాతీయ హక్కుల సంస్థ 2015-16 వార్షిక నివేదికలో ఖండించింది. ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిని ప్రస్తావిస్తూ ... చాలా ప్రభుత్వాలు అంతర్జాతీయ చట్టాలను నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంది. భారత్‌లో కీలకమైన స్వేచ్ఛలపై దాడులు తీవ్రమయ్యాయని ఆమ్నెస్టీ స్పష్టం చేసింది. అసహన వాతావరణ పెరగాడనికి నిరసనగా పెద్దసంఖ్యలో కళాకారులు, రచయితలు, శాస్త్రవేత్తలు స్థాయి అవార్డులను తిరిగి ఇచ్చివేశారని గుర్తు చేసింది. 'పౌర సమాజం సంస్థలను అధికార వర్గాలు అణచివేతకు గురి చేస్తున్నాయి. లింగ, కులపరమైన వివక్ష, హింస అంతటా వ్యాపించింది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై కరుడుగట్టిన హిందుత్వ గ్రూపుల సెన్సార్‌షిప్ పెరిగిందని పేర్కొంది.

# ఫిబ్రవరిలోనే 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**రాజధాని ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఎండ వేడికి జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మండుతున్న ఎండలు మే నెలను తలపిస్తున్నాయి. గాలిలో తేమ తగ్గిపోతుండడంతో వడగాలుల తాకిడి పెరుగుతోంది. పిల్లలు, వృద్ధులు, ఉష్ణతాపానికి అల్లాడుతున్నారు. ఫిబ్రవరి మాసంలోనే ఎండలు ఇలా ఉంటే వచ్చే మూడునెలల కాలంలో ఎంత మండిపోతాయో అని తెలుగు రాష్ట్రాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండలు పెరిగాయి. సాధారణంగా ఫిబ్రవరిలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. కానీ అందుకు భిన్నంగా ఈ సంవత్సరం 35 నుంచి ఏకంగా 40 డిగ్రీలకు చేరింది. ఇక మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో సాధారణ ఉష్ణోగ్రత 50 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని వాతవరణ శాఖ పేర్కొంది. ఉదయం 10 గంటలకే సూరుడు భగభగ మంటున్నాడు. రాత్రిపూట కాస్త చలిపెట్టినట్టు అనిపించినా తెల్లవారితే ఎండలతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిజా మాబాద్, రామగుండంలో 40 డిగ్రీలు, మహబూబ్‌నగర్, వరంగల్, హైదరాబాద్‌లలో 39, మెదక్, నల్గొండ, ఖమ్మం, కరీంనగర్‌లలో 38 డిగ్రీలు, ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే రెండు మూడు రోజుల్లో40 డిగ్రీలు దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 2009లో ఫిబ్రవరి మాసంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా 2016లో అంతే ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఎండలు తీవ్రమయ్యాయి. దీంతో 13 జిల్లాల ప్రజలు ఫిబ్రవరిలోనే ఇంత వేడా అంటూ ఆందోళనకు గురువుతున్నారు. పలు జిల్లాల్లో గత సంవత్సరం కంటే ఈ ఫిబ్రవరి మాసంలో ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. కడప, కర్నూలులో 39 డిగ్రీలు, అనంతపురం, తిరుపతి, కర్నూలు, అనంతపురం, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రత 32 డిగ్రీలు మాత్రమే పమోదయ్యాయి. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో కరువు, వర్షాభావ పరిస్థితులతో తల్లడిల్లుతుంటే అనూహ్యంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడగాల్పులు ప్రారంభం కావడంతో ఇళ్ళల్లో ఒట్టివేళ్ల చాపలు, కూలర్లు, ఏసీలు తదితర వస్తువులను అమర్చుకుంటున్నారు. శీతల పానియాల విక్రయాలు జోరందుకున్నాయి. కొబ్బరి బోండాలు, చెరుకు రసం, పళ్ల రసాలు, పుచ్చకాయలు, కీరాలు విక్రయాలు పెరిగాయి.

## మార్చిలో రోటా వైరస్ వ్యాక్సిన్...



**రాజధాని.ప్రతినిధి :** డయేరియా వ్యాధితో పిల్లల్లో సంభవించే మరణాలను నివారించేందుకు ప్రభుత్వం రోటా వైరస్ వ్యాక్సిన్‌ను మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తిరుమలశెట్టి పద్మజారాణి చెప్పారు. రోటా వైరస్ సోకటం వల్ల సుమారు 40 శాతం మరణాలు పిల్లల్లో సంభవిస్తున్నట్లు తెలిపారు. పుట్టిన 6వ వారం, 10వ, 14వ వారం రోటా వైరస్ వ్యాక్సిన్‌ను పిల్లలకు చేయించటం వల్ల డయేరియా మరణాలను నివారించవచ్చున్నారు. ఏప్రిల్ నుంచి ఇంజక్షన్ ద్వారా చేసే పోలియో వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుంది. చిన్నారులకు మంచి ఆరోగ్యం ఇవ్వవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వారు ఈ విషయంలో అశ్రద్ధ చేయకుండా వ్యాక్సిన్ వేయించాలని జిల్లా వ్యాప్తంగా జరిగే పోలియో కార్యక్రమంలో పుట్టిన నెల, రోజును బట్టి వారాలు గుర్తుపెట్టుకుని 6వ,10వ,14వ వారాలలో తప్పనిసరిగా రోటా వైరస్ వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇచ్చినవారవుతామని తెలిపారు. ఈ వ్యాక్సిన్ కోసం ఆయా గ్రామాల్లోని ఆస్పత్రుల్లో పిల్లల డాక్టర్లను సంప్రదించాలని సూచించారు.

## తుళ్ళూరులో అందని 108 సేవలు




**రాజధాని.ప్రతినిధి :** మండల కేంద్రమైన తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 108 వాహనం అందుబాటులో లేకపోవడం శోచనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బుర్రా వెంకట శివారె డ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తుళ్ళూరులో ఫిబ్ర వరి 22న ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంత ప్రజలకు ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పి భూములు సేకరించిన ప్రభుత్వం, ఇప్పుడు వాటిని విస్మరించిందని చెప్పారు. స్థానిక సీహెచ్‌సీ భవనాల శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది భయందోళనల మధ్య విధులు నిర్వహిస్తు న్నారన్నారు. అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో 108 వాహనం సైతం అందుబాటులో లేక ప్రజలు ఇక్కట్లకు గురవు తున్నారని చెప్పారు. తాడికొండలో ఉన్న 108 వాహనం సకాలంలో రావడం లేదని ప్రజలు చెబుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. తక్షణమే పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించి, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 108 వాహనం ఫిరంగిపురం మండలం నుంచి కానీ, సత్తెనపల్లి నుంచి కానీ రావాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రమాదం జరిగినప్పుడు రెండు ప్రాంతాల నుంచి 108 వాహనం రావటానికి ఎక్కువ సమయం పడుతోందని తెలిపారు. దీనికి తోడు ఆ సమయానికి వాహనం అందుబాటులో ఉండడం లేదు. దీంతో పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల పరిస్థితి విషమి స్తోందని పలువురు వాపోతున్నారు. అంతే కాకుండా మండలానికి కొన్ని గ్రామాలు దూ రంగా ఉండటంతో పాటు అక్కడ కనీసం రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేకపోవటంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని తుళ్లూరులో 108 అంబులెన్స్ వాహనం అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్‌కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎన్. రామోహనరావు : 8801933160, మందడం.

దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్
& జిరాక్స్ తీయబడును
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

వివాహ బంధం
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

REALESTATE

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

నవ్యాంధ్రరాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ రింగులో ల్యాండుపూలింగ్‌లో ఇచ్చిన జరీబు పొలం 40 సెంట్లు కలదు. సంప్రదించండి 9440662699
Google Co-ordinates
16.561657, 80.476594

రేమండ్ టైలర్స్
మెయిన్ బజారు, తుళ్ళూరు

చంద్రిక ట్రేడర్స్
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రెస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935


# సంక్షోభంలో వ్యవసాయరంగం

**రాజధాని ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఈ ఏడాది ప్రకృతి అనుకూలించకపోవడంతో 3.50 లక్షల హెక్టార్లలో పంటలు వేయలేదని, మరో 7 లక్షల హెక్టార్లలో పంటలు నీరు లేక కనీస దిగుబడి కూడా రాలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటుందన్నారు. ఏపీ రైతు సంఘం ఇచ్చే సూచనలు, సలహాలన్నీ పరిగణలోకి తీసు కుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 17వ మహాసభలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని మార్కండేయ కల్యాణ మండపంలో ఆదివారం 'లాభసాటిగా చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పాలేకర్ రూపొందించిన ప్రకృతి వ్యవసాయంపై ఇటీవల రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ విధానం అనుసరిస్తున్న రైతులకు మొదటి ఏడాది ఆశించిన స్థాయిలో ఫలితం లేకపోయినా తర్వాత మంచి దిగుబడులు వస్తున్నాయని చెప్పారన్నారు. వీరంతా తమకు ఎరువులు, క్రిమి సంహారకాలు లేని ఉత్పత్తుల తయారీదారులుగా ప్రభుత్వ ధృవీకరణ పత్రాలిస్తే తమ ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ ఉంటుంనందున ఈ సలహాను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఒక ఆవు, దూడతో 32 ఎకరాలు ఎటువంటి ఎరువులు లేకుండా సాగు చేయవచ్చని పాలేకర్ విధానం చెబుతున్న నేపథ్యంలో ఆవు కొనుగోలు కోసం రైతుకు ప్రభుత్వం తరపున రూ. 10 వేల సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా రెయిన్‌గన్‌లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మోన్‌శాంటో పత్తిని సాగు చేసిన రైతుల భూముల్లో ఈ ఏడాది పింగ్‌బౌల్ పురుగు సోకినందున వారంతా వచ్చే ఏడాది పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తే తప్ప రైతులకు ప్రయోజనం ఉండదన్నారు. పెద్ద రైతులు వ్యవసాయానికి దూరమైనందున కౌలు రైతులతో కొనసాగుతున్నందున బ్యాంకులు వారిని ప్రోత్సహించాలన్నారు. రెండో విడత రుణమాఫీ నిధుల విడుదలకు ఆర్థిక ఇబ్బంది ఉందని, ఏప్రిల్‌లో రైతుల ఖాతాకు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్చి ఒకటి నుంచి ఏర్పాటయ్యే రైతు ఉద్పాదక సంఘాల ద్వారా


మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వచ్చే ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,000 సంఘాలు ఏర్పాటుతో 10 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించనున్నట్లు మంత్రి చెప్పారు. సీఆర్డీఏ రీజియన్ పరిధిలోని వ్యవసాయ జోన్‌ల విషయంలో రైతుల ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ ఒకప్పుడు సంపన్నదేశాల్లో ఒకటిగా భారత్ ఉందంటే ఇందుకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వృద్ధే కారణమన్నారు. నేడు వీటిని విస్మరించడంతో పేద దేశాల సరసన చేరిందన్నారు. చిన్న సన్నకారుల రైతులు తమకున్న కొద్దిపాటి భూమిలో ఒకే పంట వేయడం మాని వివిధ రకాల పంటల సాగుతో అధిక ప్రయోజనం పొందవచ్చని చెప్పారు. ఆకు కూరలు, కూరగాయలు సాగుతోపాటు పశువులు, గొర్రెలు, కోళ్ళ పెంపకం చేపట్టాలని సూచించారు. కొన్ని పంటల్లో అంతర్‌పంటల సాగు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సూక్ష్మజీవులు లేని భూమి నిర్జీవమవుతుందని, అవే మొక్కకు అవసరమైన పోషకాలు అందిస్తాయన్నారు. రైతు నేత, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సేద్యం లాభసాటిగా లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతూ విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. నాలుగు కోట్ల మంది రైతులు వ్యవసాయాన్ని వీడి ఇతర వృత్తులవైపు మళ్ళుతున్నారన్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లకున్న గౌరవమే సమాజంలో రైతు కుటుంబానికి దక్కేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, అధ్యక్షులు పి. రామచంద్రయ్య, కార్యదర్శి కేవీవీ ప్రసాద్, మంగళగిరి మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం



డాక్టర్ దీపక్ వర్మ
బి.హెచ్.ఎమ్.ఎస్.

## సిఫిలిస్ ఇన్‌ఫెక్షన్

సిఫిలిస్ అనే ఈ వ్యాధి ఒక ఇన్‌ఫెక్షన్. ముఖ్యంగా చర్మం మీద లేక చర్మం కింది పొరలలో కనిపించే సమస్య. ఈ వ్యాధి మనుషులకు వచ్చే సుఖవ్యాధులలో ఒకటి. ఇది ఒక రకమైన బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్. ఈ సిఫిలిస్ అనే వ్యాధి పలు రకాలుగా వర్గీకరించవచ్చు. ముఖ్యంగా ఈ వ్యాధి రెండు రకాలు. అవి

1.ఎక్వైర్డ్ : అంటే మనుషుల పొరపాట్లు, అలవాట్లు, అజాగ్రత్త అయిన అబధ్రత అయిన సంయోగ అలవాట్లు, ఇన్‌ఫెక్షన్ ఉన్న రక్తం దానం చేయడం లేక, ఇవ్వడం వల్ల, దెబ్బలు తగిలిన చోట ఈ రకపు బ్యాక్టిరియా సోకడం ఈ వర్గీకరణ వస్తుంది.

2.కన్‌జెన్‌టల్ సిఫిలిస్ : ఈ రకపు ఇన్‌ఫెక్షన్ తల్లి నుండి పిల్లలకు సోకుతుంది. ఈ రోగం వల్ల ఎంతో మంది స్త్రీలలో గర్భస్రావం(అబార్షన్) లేక పిల్లలు గర్భంలోనె చనిపోవడం గమనించవచ్చు.

కారణాలు :

1. సిఫిలిస్ అనే ఈ వ్యాధి రావడానికి కారణం హెర్పెస్ సింప్లెక్స్ అనే బ్యాక్టిరియా.
2. ఈ వ్యాధి సిఫిలిస్ ఉన్న వారితో శారీరకంగా సంభోగించినప్పుడు కలుగుతుంది.
3. చర్మం మీద దెబ్బలు, గాట్లు అయినప్పుడు వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఈ బాక్టీరియాకు ఎక్స్‌పోజ్ ఇవ్వడం జరిగితే ఈ వ్యాధి వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ .

వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం.
సరైన వైద్యం చేయించుకోకపోవడం
వ్యాధి నిర్ధారణ విషయంలో నిర్లక్ష్యం చేయడం.
స్వలింగ సంపర్కులు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

లక్షణాలు:

1. ప్రైమరీ సిఫిలిస్ : శారీరకంగా సంపర్గం ఇన్‌ఫెక్షన్ ఉన్నవారితో జరిగినపుడు, లేక ఇన్‌ఫెక్షన్ ఉన్న రక్తమార్పిడి జరిగినప్పుడు, గాయాలను బాక్టీరియా ఎక్స్‌పోజ్ అయినపుడు ఒక మనిషికి ఈ రోగం రావాలంటే 9 నుండి 90 రోజులు పడుతుంది.
2. ఎర్రటి పుండ్లు, పురష్కారం లేదా యోనిపై కనిపించడం, చేతివేళ్ళు, పెదవులు, నాలుక, మల ద్వారం ప్రాంతాలు కనిపించును.
3. గజ్జలలో రక్తనాళాలు వాయడం
4. ఈ పుండ్లు మొదటి దశలో ఎలాంటి మంట, నొప్పి ఉండకపోవడం ఈ వ్యాధి లక్షణం.
5. ఈ దశలో ఈ వ్యాధికి వైద్యం తీసుకోని ఎడల ఇది రెండో దశలోకి మారిపోతుంది.

సెకండరీ సిఫిలిస్ : వ్యాధి పుండ్లు కనిపించిన 6-8 వారాలలో ఈ దశలోకి ప్రవేశిస్తుంది.

# లక్ష సేద్యపు కుంటల నిర్మాణం

- 20వేల బోర్‌వెల్స్ ఏర్పాటు లక్ష్యం
- పంచాయతీలో 100 సేద్యపు కుంటల
- జిల్లా కలెక్టర్ శ్రీ కాంతిలాల్ దండె

**రాజధాని.ప్రతినిధి-గుంటూరు :** జిల్లాలో కరువును అధికమించి, భూగర్భ జలాలను పెంచుకునేందుకు లక్ష సేద్యపు కుంటల నిర్మాణం, 20 వేల బోర్‌వెల్స్ ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ శ్రీ కాంతిలాల్ దండె తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గత బుధవారం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ముందుగా వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ, వర్షా భావాన్ని అధికమించి భూగర్భ జలాలను పెంచుకొనెలా ప్రతి గ్రామ పంచాయితీలో 100 సేద్యపు కుంటల వంతున నిర్మాణం చేపట్టేలా వ్యవసాయశాఖ, ఉద్యాన వన శాఖ, ట్రాన్స్‌కో, భూగర్భ జల శాఖ, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే జిల్లాలో భూగర్భ జలాలు అందుబాటులో వున్న ప్రాంతాలలో 20వేల బోర్ వెల్స్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థను సమీక్షిస్తూ, జిల్లా నీటి యాజమాన్య సంస్థను సమీక్షిస్తూ , జిల్లాలో సేద్యపు కుంటల నిర్మాణం, బోర్‌వెల్స్ ఏర్పాటు, సి.సి. రోడ్ల నిర్మాణం, పని దినాలు కల్పించడం వంటివి లక్ష్యం మేరకు పని చేయాలన్నారు. ప్రతి క్షేత్ర సహాయకుడు వారానికి 500 పనిదినాలు కల్పించేలా కార్యా చరణ ప్రణాళిక రూపొందించుకొని, దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. జిల్లాలో మీకోసం, జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత


సమీక్ష జరుపుతున్న కాంతిలాల్ దండె, వివిధ శాఖల అధికారులు

అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో" ఇ- అంటెండెన్స్"ను ప్రవేశ పెట్టాలని, ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భాలలో ఇచ్చిన హామీలకు సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తి అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో మార్చి నెలాఖరుకు నాటికి కనీసం 350 గ్రామ పంచాయితీలు బహిరంగ మల విసర్జనలేని గ్రామాలుగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ డబ్ల్యు.ఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్ని అంగన్ వాణీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి అయనవి, ఇంకనూ ఎన్ని భవనల నిర్మాణాలు పూర్తి కావలసివున్నది పూర్తి నివేదికను అందజేయాలని కలెక్టర్ ఐ.సి.డీ.ఎస్. అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా 1వ తేది నాటికి ఫించన్లు పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్ డీ.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్‌ని ఆదేశించారు. జిల్లాలో బుద్ద జయంతి, సూర్యలంక బీచ్ పెస్టివల్స్‌ను పెద్ద ఎత్తున నిర్వహించేందకు కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అన్నారు. ఎస్.సి, ఎస్.టి, బిసి., మైనార్టీలకు సంబంధించి ఎన్ని వసతి గృహాలను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చుటకు అవకాశం ఉన్నదో పూర్తి నివేదికను అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికార్లను ఆదేశించారు. జిల్లాలో బాలురకు, బాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు లేని పాఠశాలలు జిల్లాలో ఎన్ని ఉన్నాయి, వాటి నిర్మాణాలకు అవసరమైన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ విద్యా శాఖాధికారిని ఆదేశించారు. 10వ తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. రాబోయే వేసవిలో జిల్లాలో మాచర్ల, వినుకొండ, గురజాల, నరసారావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట ప్రాంతాలలోని గ్రామాలలో త్రాగునీటి సమస్య అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు.

త్రాగునీటి సమస్యను అధికమించేందుకు ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైన అన్ని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయాలని అధికారులను సూచించారు. కృష్ణా పుష్కరాలకు సంబంధించి అన్ని శాఖల నుండి ప్రతిపాదనలు రావడం జరిగిందని, అయితే తక్కువ నిధులతో తాత్కాలిక పనులు, ఎక్కువ నిధులతో శాశ్వత పనులు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. గుంటూరు నగరం నుండి పుష్కర ప్రాంతాలకు వెళ్ళె అప్రోచ్ రోడ్డు విస్తరణ, మరమ్మత్తు పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆర్.అండ్ బి, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డా॥ చెరుకూరి శ్రీధర్ గుంటూరులో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ సభ్యత్వ నమోదు



**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్(టి.యన్.ఎ.టి.యు) కృష్ణాజిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, జిల్లా అంగన్‌వాడీ సమన్వరకర్త ఆచంట సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య, పార్టీ జిల్లా అధ్యక్షులు బచ్చుల అర్జునుడు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. తొలుత జరిగిన సమావేశంలో మంత్రి దేవినేని మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలను తమకు తెలియజేస్తే తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ట్రేడ్ యూనియన్ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాద బీమా సౌకర్యంతో పాటు, రాయితీలు కల్పిస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్‌లో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకుని యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు, జిల్లా అంగన్‌వాడీ సమన్వయ కర్త ఆచంట సునీత మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ, ప్రభుత్వానికి 700 కోట్లు భారమైనప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీల జీతాలు పెంచారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలందరూ తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షురాలు కొడాలి హేమలత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ, అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సభ్యులు ఎన్. లక్ష్మీ, కృష్ణవేణి, సి.హెచ్.వరలక్ష్మి, పెద్ద ఎత్తున అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు సమావేశంలో పాల్గొని సభ్యత్వం తీసుకున్నారు.

# కొత్త రైల్వే లైన్‌పై పిఠాపురం ప్రజల హర్షం

**పిఠాపురం, రాజధాని ప్రతినిధి :** దక్షిణ కాశీగా పిలుస్తున్న పిఠాపురానికి త్వరలో మంచి రోజులు రానున్నాయని, ఎన్నో సంవత్సరాల నుంచి కలగా మిగిలిన పిఠాపురం కాకినాడ రైల్వేలైన్ పనులు త్వరలో పట్టాలెక్కనున్న సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష తీరనుందని పూర్వపు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ చెప్పారు. కేంద్రప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో 50 కోట్లు కేటాయించినందున పనులు త్వరగా మొదలుపెట్టి సత్వరం పూర్తి చేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. కేవలం 15 కిమీ దూరమున్న ఈ లైన్ కలపడం వల్ల ఎన్నో లాభాలున్నాయని, ముఖ్యంగా సరుకు రవాణాకు, దూర ప్రాంత ప్రయాణికులు, వ్యాపారులకు ఎంతో ఉపయోగం ఉందని అన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ అంతరాయం ఉండదని విశ్వనాథ్ తెలిపారు. కాకినాడ ఏ1 కేటగిరి స్టేషన్ అయినందున, దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్ 25 శాతం రెవెన్యూ కాకినాడ పోర్టు నుంచే వస్తున్నా, ఈ ప్రాంత అభివృద్ధి నోచుకోలేదన్నారు. ఇప్పటికే కాకినాడ మొదటి విడతలో స్మార్ట్ సిటీగా ఎంపిక అయినందున పిఠాపురం కాకినాడ రైల్వేలైన్‌తో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.


టి.శ్రీనివాస విశ్వనాథ్

# పాచినీరే...
# గ్రామాల ప్రజలకు ప్రాణజలం..?

- మొండికోడు సిపిడబ్ల్యూ ఎస్ స్కీం కంపుకొడుతోంది
- వ్యాధుల బారిన శివారు గ్రామాలు

**రాజధాని ప్రతినిధి, ఏలూరు రూరల్ :** గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏలూరు రూరల్ మండలం మొండికోడు సిపిడబ్ల్యూఎస్ స్కీం నుండి 6 శివారు గ్రామాలకు సరఫరా అయ్యే త్రాగునీరు పాచిపట్టి కంపుకొడుతొందని శివారు గ్రామాలైన ప్రత్తికోళ్లంక, మొండికోడు, పైడిచింతపాడు, గుడివాక లంక, కోక్కిరాయిలం గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మొండికోడులో రహదారులు లేవు. అయినా ప్రజలు కాలువల్లో, గుంతల్లో నడుస్తున్నారు. తప్పదు కదా మురుగులోనే మగ్గుతున్నారు. రక్షిత జలమైనా అందుతుందంటే అదీలేదు.

**పాలకుల శాపమా? ప్రజల పాపమా??**

రూరల్ మండలం మొండికోడు గ్రామం దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్నికలలో ఓట్లు వేయడమే ఆ గ్రామం పాలిట శాపంగా పరిణమించిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామానికి ఎఅధికారి రారు. అక్కడి సమస్యలు పట్టించుకోరని ప్రజలు వాపోతున్నారు. గ్రామం శివారు ప్రాంతం నుండి గ్రామంలోనికి రావాలంటే అక్కడ ఉండే వంతెన కూలిపోయింది. అయితే అక్కడి ప్రజలు తప్పని సరి పరిస్దితిలో చుట్టూ తిరిగి కొవ్వలి మీదుగా ఏలూరు వచ్చి అక్కడి నుండి తిరిగి గ్రామంలోనికి రావాల్సిన పరిస్దితి. ఈ వంతెన కూలి 10 ఏళ్లకు పైబడినా నేతలు పట్టించుకునే నాధుడు కానరావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఉపాధిలేదు..పధకాలు దరిచేరవు.**

ప్రభుత్వం గ్రామాల్లో నివసించే ప్రజలకు ఉపాధిహామీ పదకం, రేషన్‌కార్డులు, గ్యాస్‌కనెక్షన్‌లు, పెన్షన్‌లు , ఇల్ల స్దలాలు వంటివి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. అయినా ఈ గ్రామంలో నివశించే ప్రజల చెంతకు అవి దరిచేరడం లేదని గ్రామస్దులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలలో తాము అధికార పార్టీకి ఓట్లు వేసి గెలిపించినా నేతలు తమ గ్రామాన్ని అపార్ధచేసుకుని గ్రామం వైపు చూడకుండా సీతకన్ను వేశారని ( ఓటర్లలో అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గ్రామ పంచాయితీకి ఎన్నికలు జరిగి దాదాపు మూడేళ్లు కావస్తున్నా అక్కడ అభివృద్ధి అన్నది మచ్చుకకు కూడా కానరావడం లేదని గ్రామంలో మహిళలు ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంటి స్దలాల విషయంలో గ్రామానికి ఓకే ఒక్క ఇల్లు మంజూరైందంటే పరిస్దితి అర్ధం చేసుకోవచ్చు. అదీకూడా ఎవరికి ఎక్కడ మంజూరైందనే దాని మీద కూడా ప్రజలకు సమాచారం లేదు.

ఇక సిపిడబ్ల్యూ పంపింగ్ స్కీం ద్వారా శివారు గ్రామాలకు సరఫరా జరిగే త్రాగునీరు కంపు కొడుతున్నా గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఆ విభాగం అధికారులు ఆ


అపరిశుభ్ర వాతావరణంలో నీటిని విడుదల చేసే వాల్

వైపుగా కన్నేత్తి కూడా చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. త్రాగునీటి విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడు లేవని శివారు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్రమైన నీరు త్రాగడం వలన రోగాలు బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంభందిత అధికారులు పట్టించుకుని సీపీడబ్ల్యూ స్కీం ద్వారా సరఫరా శివారు గ్రామాలకు సరఫరా అయ్యే నీటిని శుభ్రపరచి స్వచ్ఛమైన త్రాగనీరు పైపులైన్ల అందించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని


కూలిపోయిన రహదారి బ్రిడ్జి


పంపిగ్ స్కీంలో పాచిపట్టిన నీరు

# కాలుష్య ఒప్పందం సరే... అమలు ఏది?



**రాజధాని ప్రతినిధి :** పారిస్ వాతావరణ కాలుష్యం, భూతాపం తగ్గింపు అంశాలపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఒప్పందం కుదిరింది. ఇప్పుడు గ్రీన్‌హౌస్ గ్యాసెస్‌ను (ఉద్గారాలు లేదా విషవాయువులు) తగ్గించే అంశంపై ఆయా దేశాలు నిర్దిష్టమైన కార్యచరణ రూపొందించుకోవాలి. గ్రీన్‌హౌస్ ఉద్గారాలు గరిష్ఠస్థాయికి చేరాయి. ఈ శతాబ్ది మధ్యనాటికి విషవాయు వులను గణనీయంగా తగ్గించడం ద్వారా భూమండలం వేడిని 1.5 డిగ్రీల సెల్షియస్‌కు పరిమితం చేస్తే ఎక్కువ మేలు జరుగుతుందనీ భావిస్తున్నారు.

అయితే గ్రీన్‌హౌసెస్ ఉద్గారాలను తగ్గించి ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులను కల్పించడం ఎలా అన్నది అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలముందున్న పెద్ద సవాలు. తక్కువ కర్బనపు వాయువులు విడుదలయ్యే అభివృద్ధి పంథాను అనుసరించడమే ఏకైక పరిష్కార మార్గం సాంకేతిక, ఆర్థిక సహకారం అందినట్లయితే ఇప్పటికే రూపొందించుకొన్న ఇంటెండెడ్ సేషనల్లీ డిటర్మిండ్ కంట్రిబ్యూషన్స్ (ఐఎన్‌డిసి) లక్ష్యాల ద్వారా అనుకొన్నది సాధించవచ్చునని భారత్‌లాంటి దేశాలు భావిస్తున్నాయి. సాంకేతిక సహకారంలో ఒకటి కంటే ఎక్కువ పద్ధతులు ఉన్నాయి. ఉత్పత్తి విధానాల బదిలీ, నిపుణలు, విజ్ఞానం, ఆర్థిక తోడ్పాటు, సంస్థా గత ఏర్పాట్ల ద్వారా సౌకర్యాలు కల్పించడం లాంటి పద్ధతులు న్నాయి. వాతావరణ మార్పులపై ఐరాస ఫ్రేమ్‌వర్క్ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసిన నాటి నుంచీ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కష్టమేనన్న భావన బలంగా ఉంది.

***సాంకేతిక సౌలభ్యం అవసరం..***

ప్రపంచవ్యాప్తంగా పునర్వినియోగ ఇంధన విధానాలను వేగంగా అనుసరించాలంటే నూతన ఆవిష్కరణలు, సాంకేతికల బదిలీ అవసరం. ఉదాహరణకు క్రిస్టిలిన్ సిలికాన్ సోలార్ (సౌర) ప్యానెల్స్ సగటున 15 శాతం సామర్థ్యం మాత్రమే కలిగి ఉన్నాయి అమెరికా, ఐరోపా దేశాలలో ప్రయోగశాల దశలో 45 శాతం సామర్థ్యం కలిగిన ప్యానల్స్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఇవి ఇంకా వాణిజ్య పరంగా అందుబాటులోకి రాలేదు. భారత్ లాంటి దేశాలకు అందుబాటులోకి వస్తే.. ప్రస్తుతం వినియోగిస్తున్న భూప్రాంతంకంటే చాలా తక్కువ ప్రాంతంలో ఆధునిక దశ పునర్వినియోగ ఇంధనవనరులను వినియోగించుకొనే అవకాశం కలుగుతుంది. లైసెన్సు ఫీజులు లాంటివి చెల్లించి ఈ సాంకేతికతలను వినియోగించుకొంటే కొత్తగా అత్యధిక పెట్టుబడులను అభివృద్ధి చెందుతున్న దేశాలు పెట్టే అవసరం తప్పుతుంది. సమయమూ కలిసివస్తుంది. అలాగే హైబ్రీడ్ (పెట్రోలు–విద్యుత్) వాహనాలు దశాబ్దికాలంగా అమెరికాలో తిరుగుతున్నా మనకు అందుబాటులోకి రాలేదు. వీటి సామర్థ్యం కూడా అధికం. అంతేకాదు... వీటినుంచి వెలువడే కలుషిత వాయువులు తక్కువ. ధర కూడా సహేతుకంగానే ఉంది. మనదేశంలో అనేక రాష్ట్రాలు విద్యుత్ బస్సులను కొనుగోలు చేయడంలేదు. ఎందుకంటే బ్యాటరీ ధర ఎక్కువ వుండటమే కారణంగా చెపుతున్నారు.

పరిశోధన,సాంకేతికతల అభివృద్ధితోపాటు వాటిని అమలు చేసేందుకు, మార్కెట్‌లో ఆధునికతలను ప్రవేశ పెట్టేందుకు తగిన తోడ్పాటునిచ్చే నియమ నిబంధనలు, విధానాలు రూపొందించుకోవాలి. ఉధాహరణకు ఇంధన సామర్థ్యం బ్యూరో కాంపాక్ట్ ఫ్లోరోసెంట్ లాంప్‌లను ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని గట్టిగా కృషి చేసింది. ప్రభుత్వం పెద్ద ఎత్తున వీటిని సమీకరించేందుకు కృషి చేసింది. దీనివల్ల అనేక ప్రాంతాల్లో మెరుగైన సాంకేతిక వ్యవస్థ అందుబాటులోనికి వచ్చింది. అలాగే ఎల్ఇడి బల్బులను ప్రభుత్వం ప్రోత్సహించింది. దీనివల్ల 310 రూపాయలున్న బల్బు ధర 69 రూపాయలకు తగ్గింది.

ప్రతి దేశానికీ నూతన సాంకేతికలు అవసరమే. మనకు ఇంధనరంగంలో అత్యధిక సామర్థ్యంగల పునర్వినియోగ విధానాలు కావాలి, అలాగే మెరుగైన సాంకేతికతల నిల్వ సౌకర్యాలు, స్మార్ట్‌గ్రిడ్స్, పరిశుభ్రమైన ప్రజా రవాణా వ్యవస్థ, మెరుగైన ఆటోరిక్షాల్లాంటి పారా–రవాణా వ్యవస్థ, సమర్థమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రావాలి. ఎందుకంటే ఇవే అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. మన దేశంలో అధిక వేడి వాతావరణం ఉంటుంది గనుక దీనికి అనుగుణంగా పనిచేసే సాంకేతికతలు కావాలి. స్థానిక పరిస్థితులకు దిగుమతి చేసుకొనే సాంకేతికతలు ఉండాలి. క్లైమెటిక్ టెక్నాలజీ అండ్ నెట్‌వర్క్ (సిటిఎన్‌టి), టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ కమిటీని 2010 లోనే ఏర్పాటు చేశారు. ఐరాస టెక్నాలజీ యంత్రాంగం అజమాయిషీలో ఇది పనిచేస్తుంది. సాంకేతికతల బదిలీ, నిపుణుల మధ్య భాగస్వామ్యం ఏర్పాటుకు ఇది కృషి చేస్తుంది. అయితే దీనికి కావలసినంత తోడ్పాటులేదు. సాంకేతికతల బదిలీకి సంబంధించి యుఎన్ఎఫ్‌సిసిసి పరిధిలో ఈ సంస్థకు ఏ మాత్రం ప్రాధాన్యత కల్పించలేదు. ఈ సంస్థ ద్వారా సారేకతికతల బదిలీ ప్రక్రియ నిర్వహిస్తే ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు, పారదర్శకత పెరుగుతాయని దీన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ దీని ఉనికి, లక్ష్యాల సాధన అతి తక్కువగా ఉంటుంది. పూర్తి లక్ష్యాలు సాధించడానికి దశాబ్దాలు పడుతుంది. గ్రీన్‌హౌసెస్ ఉద్గారాల విడుదలను జీరో స్థాయికి చాలా తక్కువగా ఉంది. అందువల్ల తక్కువ కాలుష్యాలు విడుదలయ్యే సాంకేతికల బదిలీ, ఆర్థిక వనరుల అందుబాటు, వీటికి అవసరమైన విధానాల రూపకల్పన నేడు ఎంతైనా అవసరం. ఇదే సమయంలో స్థానిక పరిస్థితులకు అనుగుణమైన సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలపై శ్రద్ధ వహించాలి. ఇంతవరకు రూపొందించుకొన్న అభివృద్ధి విధానాలను సమూలంగా మార్చుకోవాలి. ఈ దిశలో భారతదేశం తన విధానాలలో మార్పు చేస్తుందా? అన్నది స్పష్టత లేదు.

# పేదలకు ప'రేషాన్' !

### - పేదల కూడు దూరం చేసే యత్నం
### - రేషన్ సరకులకు గడువు
### - సరకులు ప్రభుత్వనికి చేరేలా చర్యలు

**రాజధాని ప్రతినిధి :** రేషన్ సరకుల పంపిణీలో ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేయనుండడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. చౌక ధరల దుకాణదారులు, ఆ శాఖ సిబ్బంది అవినీతిని అరికట్టేందుకు తీసుకువచ్చిన విధానాలు కొంత మేర సత్ఫలితాలను ఇచ్చినా, నిర్ణీత తేదీలోపు నిత్యావసర సరుకులు తీసుకోవాలని, లేకుంటే ఆ నెల సరఫరా ఉండదనే కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకురానుంది. ప్రతి నెలా 10 వరకు మాత్రమే రేషన్ సరకులు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి సరుకులు సరఫరా కాకుండా ఈ–పోస్ నిలిచిపోయే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలులోకి వచ్చిన ఈ విధానాన్ని గుంటూరు జిల్లాల్లోనూ ఏప్రిల్ నుంచి అయలు చేయడానికి కసరత్తు జరుగుతోంది.

***గడువు దాటితే...*** ప్రతినెలా చౌకధరల దుకాణాలకు ప్రభుత్వం ఒకటో తేదీలోపు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. ఒకటో తేదీ నుంచి 10 వరకు దుకాణదారులు సరుకులను కార్డుదారులకు సరఫరా చేస్తారు. 11వ తేదీనుంచి ఈ–పోస్ సర్వర్‌ను ప్రభుత్వం నిలుపుదల చేయనుంది. మిగిలిన సరకులు డీలర్లు 10 నుంచి 20 తేదీలోపు ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. ఆ తరువాత నెల సరకుల సరఫరాకు అవసరమైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను 20 నుంచి 30లోపు ప్రభుత్వ అధికారులకు చౌకధరల దుకాణాదారులు అందజేయాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల మిగిలిన సరకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించే అవకాశం ఉండదు. ప్రభుత్వం తీసుకురానున్న ఈ విధానం నిరుపేదలకు కష్టాలను మిగల్చనుంది. కూలీనాలీ చేసుకొని జీవించే సగటు జీవులు ఏ మాత్రం ఉపేక్షించినా ఆ నెల రేషన్ వదులుకోవాల్సిందే. పనులు మానుకొని సరకులు తీసుకోవాలి. వలసకూలీల పరిస్థితి మరీ దారుణంగా మారనుంది. రోజుల తరబడి గ్రామాల్లో లేని కాలంలో సరకుల పంపిణీ చేస్తే నోటిదగ్గర కూడు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక రేషన్ డిపోలకు సరుకు రవాణా చేయడం ఆలస్యమైనా కార్డుదారుడే నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించాలని కోరుతున్నారు. ఎన్ని చర్యలు తీసుకున్నా జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం అదుపులోకి రావడం లేదు. ప్రకాశం జిల్లా సరిహద్దుల నుంచి, చిలకలూరిపేట, పల్నాడు ప్రాంతాల నుండి లారీల్లో తరలిపోతున్నాయి. ఈ దశలో ఈ–పోస్ లాంటి సాంకేతిక పద్ధతులు వల్ల పేద ప్రజలకు ఇబ్బంది మినహా రేషన్ అక్రమ రవాణాదారులకు నష్టమేమీ లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

### బీటీ పత్తి విత్తనాలపై ఏ కంపెనీకీ పేటెంట్ హక్కులు లేవు

# ఢిల్లీలో ధర నిర్ణాయక కమిటీ భేటీ

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** రాష్ట్రంలో బీటీ పత్తి విత్తనాలపై ఏ కంపెనీకీ పేటెంట్ హక్కులు లేవు. సాంకేతిక హక్కులు మాత్రమే ఉన్నాయి. అయినా రాయిల్టీని వసూలు చేస్తున్నాయి. ఒక్కో బీటీ కాటన్ విత్తనాల ప్యాకెట్‌పై రూ. 10 నుంచి రూ.50 వరకు రాయల్టీని కోన్నేలుగా వసూలు చేస్తున్నారు. ఈ రాయల్టీని పుర్తిగా రద్దు చేయాలని రైతు సంఘాలు డింమాండ్ చేస్తున్నాయి. పత్తి విత్తనాల ధర నిర్ణయించేందుకు జాతీయస్థాయి కమిటీ ఈ నెల 24న ఢిల్లీలో సమావేశం అయ్యింది. రాయల్టీ ఫీజు, డీలర్ల లాభాన్ని కలుపుకుని పత్తి విత్తనాల కనీస అమ్మకం ధరను నిర్ణయించేందుకు 9 మందితో కూడిన కమిటీని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ కమిటీ మార్చి 31లోగా ధరను నిర్ణయించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాల్సి ఉంది. మార్చి 4న ఢిల్లీ హైకోర్టులో 'మైకో మోన్‌శాంటో బయోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వేసిన కేసు విచారణకు రాసుకున్న నేపథ్యంలో బుధవారం నాటి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ధరలను నియంత్రిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మోన్‌శాంటో కంపెనీ హైకోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో పత్తి విత్తనాల కోసం రైతులు కంపెనీలకు చెల్లించాల్సిన ధరను క్లైయిటీ నిర్ణయించింది. పత్తి సాగులో దేశవ్యాప్తంగా ఐదో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కమిటీలో ఒక్క ప్రతినిధి కూడా లేకపోవడం గమనార్హం. తెలంగాణ నుంచి రైతు ప్రతినిధిగా బీజేపీ నేత పి. సుగుణాకరరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ పత్తి విత్తనాల ధరను నిర్ణయిస్తే రాష్ట్రంలోని విత్తన చట్టం భవిష్యత్తు ప్రశ్నర్థకంగా మారనుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏపీ సీడ్ యాక్ట్‌ను తీసుకొచ్చారు. రైతులకు అన్యాయం జరుగకుండా చర్యలు చేపట్టారు. విత్తనాల విక్రయాన్ని నిత్యావసర వస్తువుల చట్టం పరిధిలోకి తీసుకొస్తారా?లేదా? అనేది స్పష్టం కావాల్సి ఉంది. బీటీ కాటన్ విత్తనాన్ని పండిస్తున్న రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నా కంపెనీలు విక్రయించేటప్పుడు మాత్రం అధిక ధర వసూలు చేస్తున్నాయి. ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని రైతులు కమిటీని కోరుతున్నారు.

# మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు

### జిల్లా సైనిక్ బోర్డు ప్రథమ సమావేశం

**రాజధాని ప్రతినిధి :** దేశా రక్షణ కోసం అహర్నిశలు శ్రమించి పదవీ విరమణ చేసిన మాజీ సైనికుల సంక్షేమం కోసం కావలసిన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా సైనిక్ బోర్డ్ చైర్మన్ జిల్లా కలెక్టర్ కాంతాలాల్ దండే అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యతన జిల్లా సైనిక్ బోర్డు ప్రథమ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా సైనికా బోర్డు సమావేశం జరిపి మాజీ సైనిక కుటుంబాలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 7 తేదీన సైనిక్ సంక్షేమ దినోత్సవం భారీ ఎత్తున నిర్వహించాలని అన్నారు. జిల్లా సైనిక్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సైనిక్ రెస్ట్ హౌస్ నిర్మిస్తామని అన్నారు. రాష్ట్ర మైనారిటి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు ఎం.డి హిదాయత్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా దేశరక్షణ కోసం ప్రాణత్యాగాలు చెబుతున్నా వీర సైనికులు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయులని అన్నారు. జిల్లాలోని చందోలు, కర్లపాలెం, నిజాంపట్నం, తదితర ప్రాంతాలలో మైనారిటీ వర్గాల వారు ఎక్కువ మంది భారత సైన్యంలో ఉన్నారని, ఆయా ప్రాంతాలలో ప్రత్యేక సమావేశాలు జరిపి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. సమావేశానికి జిల్లా సైనిక్ బోర్డు కార్యదర్శి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి డా।। బాలాజీ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. తొలుత ఇటీవల సియోచిన్ పర్వత ప్రాంతంలో విధి నిర్వహణలో చనిపోయిన వీర జవాన్ ముస్తాన్ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. సమావేశంలో జిల్లా సైనిక్ బోర్డు వైస్‌ప్రెసిడెంట్ డా।। సి. శ్రీనివాసరావు, సభ్యులు కల్నల్ బి. హరికృష్ణ నాయుడు, కల్నాల్ ధారు చౌదని, జిల్లా విధ్యావాఖాధికారి శ్రీనివాసరెడ్డి, ఎక్స్–నాయబ్ సుబీదార్ నాగమల్లేశ్వరరావు, ఎక్స్ ఎన్.కె.ఆర్.వి. హనుమంతరావు, భాష్యం రామకృష్ణ, జవ్వాది గంగాధరరావు, జీవన్, ప్రత్యేక ఆహ్వానితులు మేజర్ వి.ఆర్.కె.చారి, మురళీకృష్ణ పాల్గొన్నారు.



జిల్లా సైనిక బోర్డు సమావేశంలో మాట్లాడుతూన్న జిల్లా కలెక్టర్ హిదాయత్

# ముఖ్యమంత్రి ఇంటికి మరో దారి

**రాజధాని ప్రతినిధి :** తాడేపల్లి మండలం వద్ద ఉన్న అమరావతి కరకట్ట మార్గంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసానికి రెండో మార్గం సిద్ధమైంది. ఇప్పటివరకు సీతానగరం నుంచి అమరావతి కరకట్ట మార్గంలో ముఖ్యమంత్రి తన నివాసానికి చేరుకుంటున్నారు. ముఖ్యమంత్రి నివాసం నుంచి ప్రత్యామ్నయంగా మరోమార్గం ఏర్పాటుచేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఉండవల్లి వద్ద కొండవీటివాగు వంతెన నుంచి మరో మార్గాన్ని 1.2 కిలోమీటర్లు ముఖ్యమంత్రి నివాసం వరకు ఏర్పాటు చేశారు. గ్రామీణాభివృద్ధి నిధుల నుంచి ఇందుకోసం రూ.2.7 కోట్లు నిధులు ఖర్చుచేశారు. 10 మీటర్ల వెడల్పుయిన రహదారి నిర్మాణం రూపొందించారు. ఉండవల్లి కూడలి నుంచి ఉండవల్లి గ్రామాన్ని కలుపుతూ గ్రామ శివార్లలోని కొండవీటివాగు వంతెనమీదుగా ముఖ్యమంత్రి నివాసానికి చేరుకోవడానికి ప్రత్యామ్నాయంగా ఈ మార్గం దోహదపడుతుంది.

# పట్టాలపైకి...మెట్రో

**రాజధాని ప్రతినిధి :** పాన్ అంతర్జాతీయ సహకార సమాఖ్య (జైకా) బృందం పర్యటన 'మెట్రో' పథకంలో కదలిక తీసుకోచ్చింది. రుణం ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయటం ద్వారా పనులు ప్రారంభానికి ఊతం దొరికినట్లైంది. భూసేకరణ త్వరలో ముగించినట్లు జిల్లా కలెక్టరు వెల్లడించిన నేపథ్యంలో ఆ ప్రక్రియ కూడా కొలిక్కి రానుంది. మొత్తంగా పథకం పట్టాల పైకెక్కటానికి ఒక్కో మార్గం సుగమమవుతోంది.

2018 డిసెంబరు నాటికి రెండో కారిడర్‌లో మెట్రోరైలు పరుగులు తీయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. మొత్తం రూ.7 వేల కోట్ల వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు చెరో రూ. వెయ్యికోట్ల చొప్పున భరిస్తుండగా మిగిలిన దాంట్లో ఎక్కువభాగం రుణంగా తీసుకోవాలని నిర్ణయించారు.

ఆ మేరకు ఇలాంటి పథకాలకు అతి తక్కువ వడ్డీతో రుణం అందించే జపాన్ అంతర్జాతీయ సహకార సమాఖ్య(జైకా)ను సంప్రదించారు. ప్రతిపాదనలతోపాటు డీపీఆర్‌ను కూడా అందజేశారు. అధ్యయనం అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటిం చాలని నిర్ణయించి మూడురోజుల కిందట నగరానికి వచ్చారు. డీపీఆర్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన బృందం రుణం ఇచ్చేందుకు ప్రాథమికంగా అంగీకరించింది. అందుకు 16 నెలలు పడుతుందని చెప్పడంతో అధికారులు సమయం కుదింపుపైనే దృష్టి సారించారు. ఐదారు మాసాల్లో ఇవ్వాలని ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు కొంతవరకు ఫలించాయి. త్వరగా పరిశీస్తామని జపాన్ హామీ ఇచ్చారు. అవకాశాన్ని అనుసరించి రుణాన్ని మరింత ఎక్కువ పొందేందుకు చూస్తున్నారు.

అంచనా వేసి...: బందరు ఏలూరు రోడ్డులో 25 స్టేషన్ల నిర్మాణానికి కావాల్సిన స్థలాల గుర్తింపు గతేడాది ఆఖరిలో పూర్తయింది. ఒక్కో స్టేషన్‌కు 40 సెంట్లను గుర్తించారు. పరిహారం చెల్లింపులో ఆలస్యమవడంతో భూ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా జిల్లాలో నెలలోపు పూర్తి చేస్తానని జైకా ప్రతినిధులకు స్పష్టం చేశారు. సేకరణ ముగియగానే స్టేషన్లకు సంబంధించి ప్రాథమిక పనులు మొదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు రెండో కారిడార్‌లోకి ప్యాకేజీలకు చెందిన టెండర్ల పరిశీలన తుదిదశకు చేరుకుంది. పది కంపెనీలు పోటీపడుతున్నాయి. సాంకేతిక అంశాల మదింపు పూర్తయ్యాక, ఆర్థికంగా అంచనావేసి పనులు అప్పగిస్తారు.

జైకా రుణం కోసం వచ్చేలోపు కేంద్ర రాష్ట్ర ప్రభూత్వల నిధులతో పనులు మొదలు పెడతామని ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి తెలిపారు. జపాన్ ప్రతినిధుల పర్యటన ముగిసిందని చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణాన్ని సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని కోరామన్నారు. నగరం బాగుందని నాయకుడు తకహాశి ప్రశంసించారు. పథకం ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సాంకేతిక అంశాలను ప్రతినిధులకు వివరించినట్లు డీఎంఆర్‌సీ ఎండీ రాధాకృష్ణారెడ్డి చెప్పారు. నిర్మాణ పనులు ఎలా చేపడతామో తెలిపామన్నారు. కొన్ని అంశాల్లో జపాన్ సహకారం తీసుకుంటామన్నారు.



### ఆమె

## ఇస్లాం వనితల ముందడుగు


# మహిళా ఖాజీలు

ఇస్లాంలో మహిళలకు ప్రాధాన్యం లేదు. వారికి విద్యాబుద్ధులు నేర్పరు. వ్యక్తిగత స్వేచ్ఛ ఉండదు, ఆర్థికస్వావలాంబన ఛాన్సే ఉండదని అంటుంటారు కానీ, మధ్యయుగంలోని ఛాందసవాదాన్ని రూపుమాపి మారుతున్న తరాలతో వారూ మారుతున్నారనీ, నిరూపిస్తున్నారీ నారీమణులు అఫ్రోజ్‌బేగం, జహాన్లు.

దేశ చరిత్రలో మొదటిసారిగా ఇద్దరు మహిళలు ఖాజీలుగా నియమితులయ్యారు. వారి నియామకాన్ని ఆక్షేపించిన చాంధసవాదులను దరూల్ ఉలూం (విద్యాసంస్థ) కట్టడిచేసి ఖాజీలుగా నియమితులైన రాజస్థాన్‌కు చెందిన అఫ్రోజ్‌బేగం, జహాన్ ఆరాలు ఇస్లామిక్ మత గురువులుగా నియమితులయ్యారు. వీరిరువురూ ముంబై ఇస్లామిక్ శిక్షణా కేంద్రం నుంచి సంబంధిత కోర్సును అభ్యసించారు. సెమినరీ అధికార ప్రతినిధి మౌలానా ఆష్రాఫ్ ఉస్మానీ మాట్లాడుతూ పండితులు, గురువులుగా నియమితులవటానికి మహిళలకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఖాజీగా నియమితులవడానికి, తత్ సంబంధిత కోర్సుల్లో పాండిత్యం సంపాదించిన వారు ఎవరైనా ఖాజీలుగా నియమితులయ్యే అవకాశం ఉందన్నారు. ఇస్లాంలో మహిళలకు సముచిత స్థానం ఉందని, వారికి ఖాజీలుగా, ముఫ్తీలుగాను నియమితులవ్వచ్చన్నారు. వీరి నియమాలకు వ్యతిరేకత తెలిపినవారంతా నిజమైన ముస్లింలు కాదని ఆయన అన్నారు. ఇస్లాంలో మహిళలకు గౌరవిస్తుందన్నారు.

**ఇస్లాంలో మహిళాసాధికారం**

ఇస్లాం మహిళాసాధికారితను ఎప్పుడో గుర్తించిందని, ఖాజీ, ముఫ్తీలుగా నియమితులవ్వకుండా మహిళలను అడ్డుకునే శక్తి ఎవ్వరికీ లేదని మౌలానా ఉస్మానీ తెలిపారు. జ్ఞాన సముపార్జనలో లింగబేధాన్ని ఇస్లాం వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో చాలా మదర్సాలు మహిళలకు ఖాజీలు, ముఫ్తీలుగా శిక్షణ ఇస్తున్నారు. భారతీయ ముస్లిం మహిళ ఆందోళన్ ఆధ్వర్యంలో దారుల్ ఊలూం నిస్వాను జాకియా సోమన్ నిర్వహిస్తున్నారు.



ఈ సంస్థలో శిక్షణ పొందిన ఇద్దరు మహిళలు అఫ్రోజ్, జహాన్‌లను ఆమె సత్కరించారు.

మహిళా ఖాజీలను ప్రోత్సహించి, సానుకూలంగా వ్యవహరించాలని అప్పుడే ముస్లిం మహిళలకు గుర్తింపు గౌరవం లభిస్తుందని సోమన్ తెలిపారు. ఆ దిశగా మిగిలిన ముస్లిం మహిళలు కూడా సాగాలని, అప్పుడే మహిళా స్వావలంబన సాధ్యమని ఆమె చెప్పారు.

# విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తాం

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డా. కామినేని శ్రీనివాస్**



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కామినేని



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కామినేని

**రాజధాని. ప్రతినిధి - గుంటూరు :** రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వసతి గృహాల విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన అన్నీ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఫిబ్రవరి 21 తేది గుంటూరు వైద్య కళాశాలలకు చెందిన విద్యార్థినులకు గౌతమి, కావేరి పేర్లతో రూ.7 కోట్లతో నిర్మించిన వసతి గృహాలను ఆయన ప్రారంభించారు. గదులను ఆధునాతన రీతిలో నిర్మించడంపై అధికారులను అభినందించారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించారు. వసతి గృహం నుండి వైద్య కళాశాలకు వెళ్ళేందుకు ప్రస్తుతం ఉన్న బస్సు కాకుండా అదనంగా మరొక బస్సు ఏర్పాటు చేయాలని కోరిక మీదట మంత్రి శ్రీనివాస్ తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వసతి గృహ ఆవరణలో షటిల్ కోర్టు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. 60 సంవత్సరాల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మీడియాతో మంత్రి డా. శ్రీనివాస్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వసతి గృహాలను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఆ దిశగా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గౌతమి, కావేరి వసతి గృహ భవనాలు నాణ్యత, ఆధునాతన రీతిలో నిర్మించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ వైద్య వసతి గృహాలలో 85 నుండి 90 శాతం వరకూ బాలురు ఉంటే నేడు 65 నుండి 70 శాతం బాలికలు వసతి గృహాలలో ఉంటున్నారని చెప్పారు. వీరికి కావలసిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని మరోసారి స్పష్టం చేశారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు ప్రపంచంలోనే మంచి పేరు ఉందన్నారు. మరింత అభివృద్ధికి దాదాపు రూ.60 కోట్లతో పలు కార్యక్రమాలు చేపట్టానున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.4 కోట్లు, సర్వీస్ బ్లాకుకు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు అధునాతన పద్ధతిలో కూడిన వైద్య విద్యను అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న ఎనిమిది వేల మందికి టాబ్‌లు అందించనున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం జనవరి 1 వ తేదీ నుండి గర్భిణులకు ప్రసూతి సేవలను ఉచితంగా అందిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య ఆసుపత్రులలో సుమారు రూ.500 కోట్ల విలువ గల 56 వేల పరికరాలు ఉండగా వాటిలో 7 వేల పరికారలు పనికిరానివిగా గుర్తించడం జరిగిందన్నారు. వాటి స్థానంలో కొత్త పరికరాలు ఉండగా వాటిలో 7 వేల పరికరాలు పనికిరానివిగా గుర్తించడం జరిగిందన్నారు. వాటి స్థానంలో కొత్త పరికరాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్య విద్యార్థినీ విద్యార్థులకు 500 పుస్తకాలతో డిజిటల్ లైబ్రరీని కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రతి వైద్య కళాశాలకు రూ.30 కోట్లు మంజూరు చేశామని, ఆ నిధులతో వీడియో తరగతి గదులు, నైపుణ్య శిక్షణకు ల్యాబ్‌లు, తదితర ఏర్పాట్లు చేయనున్నామన్నారు. గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు శ్రీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, వాణిజ్య పంటలకు, ఉన్నత విద్యకు ఆలవాలమైన గుంటూరు జిల్లాను మెడికల్ హబ్‌గా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన 'గౌతమి', 'కావేరి' వసతి గృహాలలో ఒక్కొక్క గృహంలో 35 గదుల వంతున 70 గదులను నిర్మించారు. ఒక్కో గదిలో సగటున ముగ్గురు వంతున 100 మంది వంతున మొత్తం రెండు గృహాలకు కలిపి 200 మంది విద్యార్థులు ఉండేందుకు ఆధునాతన రీతిలో నిర్మించారు. వసతి గృహాల నిర్మాణానికి అనేక మంది దాతలు ముందుకు వచ్చి తమ వంతుగా విరాళాలను అందించారు. గౌతమి వసతి గృహంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థినులు, కావేరి వసతి గృహంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థినులు ఉండేలా 3 అంతస్తులు నిర్మించడం జరిగింది. కార్యక్రమంలో గుంటూరు రూరల్ ఎం.పి.పి. సీతామహాలక్ష్మి, వైద్య విద్య సంచాలకులు డా.వేణుగోపాల్, భారత వైద్య మండలి ప్రతినిధి డా. రాజారావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజునాయుడు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.సుబ్బారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. టి. పద్మజా రాణి వైద్యాధికారులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొనారు.



నూతన హాస్టల్ సముదాయాలు

# ప్రభుత్వ స్కూల్స్ మూత కార్పొరేట్ కుట్రే

**పాలకుల చర్యలు అడ్డుకునే బాధ్యత అందరిదీ**

**ప్రైవేట్ వర్సిటీలకు ప్రోత్సాహం ప్రమాదకరం**

**మౌలిక సదుపాయాల కల్పనతో మంచి ఫలితాలు**

**అక్షరాస్యతలో ఆంధ్రది 31 స్థానం**



రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో

**రాజధాని ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం సరిపడినంత లేదంటూ మూడు వేల పాఠశాలలను రద్దు చేయడం కార్పొరేట్ సంస్థల కుట్రేనని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీలు పీజే చంద్రశేఖరరావు, ఏఎస్ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాన్ విలియం అధ్యక్షతన ఆదివారం 'విద్యా పరిరక్షణ' సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రలందరికీ విజ్ఞానం అందిస్తూ సమాజాభివృద్ధికి దోహదపడుతున్న చదువుల సరస్వతిని కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై ప్రైవేటు పరం చేసేందుకు పాలకులు పూనుకోవడం దారుణమన్నారు. 1991 ప్రపంచీకరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు ద్వారాలు తీయడం ప్రభుత్వ విద్యకు దుర్దినమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయన్నారు. ప్రాథమిక విద్య, ఉన్నత విద్యను ప్రైవేటుపరం చేసిన ప్రభుత్వాలు యూనివర్సిటీలనూ అప్పగించేందుకు ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించడం ప్రభుత్వ విద్యావ్యవస్థకు ప్రమాదకరమన్నారు. దేశంలో విద్య అందరికీ సొంతమైనప్పుడు నిర్బంధ విద్య చట్టం అమల్లో ఉన్నా ఫలితాలు ఎందుకు లేవన్నది పాలకులు ఆలోచించాలన్నారు. అక్షరాస్యతలో ఆంధ్ర ప్రదేశ్ 31వ స్థానంలో ఉండటం ప్రభుత్వాల వైఫల్యాలకు నిదర్శమేనన్నారు. ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ వడ్డీ వ్యాపారులు, కార్పొరేట్‌శక్తులు విద్యను వ్యాపారంగా చూస్తున్నందున అడ్డుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. 2010 సంవత్సరంలో అమలులోకి వచ్చిన నిర్బంధ విద్య అమలు చేయడానికి ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం లేదని నిరూపణ అవుతుందన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శలు కత్తి నరసింహారెడ్డి, జోసఫ్ సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులపై అదనపు పని భారం మోపడం తగదన్నారు. వీడియో కాన్ఫరెన్స్, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన విధులు అప్పగించడంతో విద్యా బోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఈ చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలన్నారు. కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానంతో ఉపాధ్యాయులకు నష్టం జరిగే ప్రమాదం ఉన్నందున రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల రక్షణ, ప్రభుత్వ విద్యావ్యవస్థ పరిరక్షణ కోసం ఎస్టీయూ నిర్వహించే పోరాటంలో ఉపాధ్యాయులు సంఘటితంగా పాల్గనాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలన్నారు. సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి కె అరుణ, ఎస్టీయూ నాయకులు సుదర్మన్, అప్పారావు, వెంగళరెడ్డి, జాన్‌విలియం, పెరుగు ప్రసాద్, సీహెచ్ ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు. తొలుత కందుకూరు ఎన్జీవో భవన్ నుంచి 500 మంది ఉపాధ్యాయులు పట్టణంలో నిర్వహించిన మోటార్‌బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.

# కేసుల విముక్తికే జగన్ ఢిల్లీ ప్రదక్షిణలు

**టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ సుబ్బారావు తదితరులు

**రాజధాని, ప్రతినిధి - విజయవాడ :** కేసుల నుండి బయటపడేందుకే వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, పార్లమెంట్ పరిశీలకులు మన్నవ సుబ్బారావు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ జగన్ త్వరలో జైలుకు పోవడం ఖాయమన్నారు. జగన్ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొడతామని చెప్పటం తన కుట్రపూరిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. అభివృద్ధి నిరోధక శక్తిగా మారిన జగన్‌ను సొంత పార్టీ వారు కూడా హర్షిచడం లేదన్నారు. జగన్ వైఖరి నచ్చక శాసన సభ్యులు బయటకు వస్తున్నారని, జగన్ ఆగడాలు తట్టుకోలేక ఆయన తల్లీ చెల్లి కూడా దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. అర్ధరాత్రి ఇ.డి. అధికారుల ఇళ్ళకు వెళ్ళి కాళ్ళు పట్టుకుంటున్నావు. ప్రత్యేక హోదా ముసుగులో ఢిల్లీ వెళ్ళి కేసులు నుంచి కాపాడుకునేందుకు ఇ.డి. చుట్టూ ప్రదక్షణలు చేయటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాన్ని పడగొడతామని జగన్ వ్యాఖ్యలు చేయటం తెలుగు ప్రజలను అవమానించటమేనన్నారు. చంద్రన్న కన్నెర్ర చేస్తే జగన్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని జగన్ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలన్నారు. రోజా, అంబటి తమ స్థాయిని మరిచి చంద్రబాబుపై వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు వల్లభనేని బాబూరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యలమంచలి గౌరంగబాబు, అర్బన్ మాజీ ప్రధాన కార్యదర్శి సొంగా రవీంద్రవర్మ, అర్బన్ బీసీ నాయకులు పాలడుగు రామకృష్ణ, వేమూరి దుర్గారావు పాల్గొన్నారు.

## 'సీమ' అభివృద్ధి కోసం
# 15న చలో అసెంబ్లీ

రాజధాని ప్రతినిధి : వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించాలని డిమాండు చేస్తూ మార్చి 15న వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున ప్రదర్శన, చలో అసెంబ్లీ కార్యక్రమాలకు, పిలుపునిచ్చామని వామపక్ష నాయకులు తెలిపారు. రాష్ట్రంలో 22 నెలల చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్ష పరిపాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ఈ కాలంలో ప్రజాసమస్యల కోసం కృషి చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ఇంతవరకూ సీఎం ఇంటర్వ్యూలు ఇవ్వలేదన్నారు. ఇప్పటివరకూ ఎవరెవరికి చంద్రబాబు ఇంటర్వ్యూలు ఇచ్చారనేది చెప్పాలన్నారు. ప్రతిపక్ష ఆందోళనలు, నిరసనలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వపాలన కొనసాగడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్ష వైఎస్‌ఆర్‌సీపీ సభ్యులంతా వారి వ్యక్తిగత వివాదాలకే సమయం వెచ్చిస్తున్నారని, బీజేపీ అసెంబ్లీలో ఉన్నా లేకున్నా ఒకటే తరహాగా వ్యవహరిస్తోందని దుయ్యాబట్టారు. చంద్రబాబు ఇంత వరకూ అఖిలపక్ష సమావేశం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలో అఖిలపక్ష సమావేశం పెట్టకుండా ఉన్న ఏకైక సీఎం చంద్రబాబే అని విమర్శించారు. సభలో సీఎం మాట్లాడిన పది రోజుల్లోనే ఏపీలో వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యేలను టీడీపీలోకి వలసలు ప్రోత్సహించారని, ఇందులో కేబినెట్ హోదా కలిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భూమా నాగిరెడ్డి ఉన్నారన్నారు. సిగ్గు లేకుండా ఇతర పార్టీల ప్రజాప్రతినిధుల్ని ఎలా చేర్చుకుంటున్నారని చంద్రబాబును నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మంది రైతులు, ఒక్క అనంతలోనే 145 మంది ఆత్మహత్యలకు పాల్పడితే, చంద్రబాబు ఎందుకు స్పందించలేదని, వారి కుటుంబాల్ని ఎందుకు అదుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రజల్లో పూర్తిస్థాయి అవిశ్వాసం నెలకొందన్నారు.

## కాపు కార్పొరేషన్ రుణాల కోసం
# భారీ సంఖ్యలో దరఖాస్తులు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** కాపు కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు భారీ సంఖ్యలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 30,551 మంది, కృష్ణాజిల్లాలో 32,084 మంది రుణాల కోసం విన్నవించుకున్నారు. అయితే గుంటూరు జిల్లాకు 2,462 యూనిట్లు కేటాయిస్తూ సంబంధిత అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. 57 మండలాల్లో మండలానికి ఇంచుమించుగా 30 యూనిట్లు మంజూరు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇవికాక మున్సిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలో కూడా ఇంతే మొత్తంలో అందజేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

***యూనిట్ విలువ రూ.60 వేలు..***

కాపు కార్పొరేషన్ ద్వారా కాపుల సంక్షేమం కోసం ఆర్థిక సాయం పథకంలో రుణాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు జిల్లాలో యూనిట్ విలువ రూ.60 వేలుగా ప్రభుత్వం నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2,462 మందికి గాను రూ.60 వేల చొప్పున రూ.14.76 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో 30వేల రూ.రాయితీలుగా కార్పొరేషన్ కింద రూ.7.38 కోట్లు బ్యాంకులు రుణాల కింద రూ.7.38 కోట్లు ఇవ్వనున్నారు.

**అధికారులు మల్లగుల్లాలు :** నకరికల్లు మండలానికి 30 యూనిట్లు మంజూరయ్యాయి. అభ్యర్థుల నుంచి మొత్తం దరఖాస్తుల 415 అందాయి. ఈ లెక్కన వీటిని గ్రామల్లో ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని బ్యాంకుల వారీగా రుణాల లక్ష్యాలను నిర్దేశించారు. ఒక్కో బ్యాంకుకు 5 యూనిట్లు కేటాయించారు. మండలంలోని ఆరు బ్యాంకులకు ఐదు చొప్పున మొత్తం 30 యూనిట్లు కేటాయించారు. ఒక్క నకరికల్లు నుంచే రుణాల కోసం 202 మంది దరఖాస్తు చేసుకోగా, కుంకల గుంట నుంచి 73 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎంపీ డీవో జి. శివప్రసాదుతో మాట్లాడుతూ మొత్తం యూనిట్ విలువ రూ.60 వేలుగా నిర్ణయించారని తెలిపారు. బ్యాంకులు రూ.లక్ష రుణం ఇస్తామని ముందుకు వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

# గ్రీన్ జోన్ అభ్యంతరాలు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** మూడు మార్పులతో రాజధాని బృహత్ ప్రణాళిక, విడుదల చేసిన రాష్ట్ర మంత్రి పి.నారాయణ రాజధానిలో సమాంతరంగా రహదారులు, 600 గృహాలు తొలగిస్తే చాలన్న మంత్రి, పనులు వేగం పుంజుకునే అవకాశం ఉందని అంచనా. రాజధాని తుది బృహత్ ప్రణాళికను స్వల్ప మార్పులతో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి. నారాయణ గత సోమవారం రాత్రి సీఆర్‌డీఏ కార్యాలయంలో విడుదల చేశారు. ఆరు రోడ్లను నేరుగా వేసేందుకు మార్పులు చేశారు. ప్రస్తుత ప్లాన్‌లో ఉన్న రోడ్లను, మార్చిన ప్లాన్‌తో పరిశీలిస్తే సమాంతరంగా వస్తాయి. రోడ్డును బైపాస్ చేయకుండా నేరుగానే వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. గత ప్రణాళికలో 3,600 గృహాలను ఆయా గ్రామాల్లో తొలగించాల్సి వచ్చింది. ప్రణాళికలో మార్పుల కారణంగా కేవలం ఆరు వందల గృహాలు తొలగిస్తే సరిపోతుంది. ఈ విషయాన్ని మంత్రి నారాయణ ధ్రువీకరించారు. రాజధాని తొలి బృహత్ ప్రణాళికలో సూచించిన అన్నీ అంశాలు అమలులోనే ఉంటాయి. వరదల సమయంలో పలు ప్రాంతాల్లో భవనాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ముంపు బారి నుంచి రక్షించేందుకు తగిన విధంగా చర్యలు తీసుకున్నారు. ముంపు నుంచి తప్పించే విధంగా రాజధాని భవనాల నిర్మాణాలు చేపట్టనున్నారు. కేవలం మూడు మార్పులతో రాజధాని బృహత్ ప్రణాళికను ఆమోదించి విడుదల చేయడంతో ఇక పనులు వేగం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆరు రోడ్లలో ఐదు ఉత్తరం, దక్షిణం వైపునకు వెళతాయి. ఒక రోడ్డు మాత్రం తూర్పు వైపునకు రానుంది. ఈ రోడ్డును కోల్‌కత్తా -చెన్నై జాతీయ రహదారిలో కలుపుతారు. గతంలో విడుదల చేసిన192 పేజీల ప్రణాళికలో కేవలం ఈ మూడు మార్పులు మాత్రమే చేసినట్లు మంత్రి చెప్పారు. గ్రామ కంఠాలపై వచ్చిన అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. వీటిపై కూడా సమగ్ర పరిశీలన జరగాల్సి ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. సచివాలయానికి నేరుగా రోడ్లు వేస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం మొదటి నుంచి ఉందని, అందులో భాగంగానే రోడ్లను నేరుగా వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పలువురు భావిస్తున్నారు.

## 'మన ఇల్లు మన బాధ్యత '
# ఇంటి పన్ను గుర్తుంచుకోవాలి

**రాజధాని. ప్రతినిధి- తాడికొండ :** మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ ప్రశాంతి పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ ఏడాది మండలంలో మొత్తం రూ.1.3 కోట్లు ఇంటి పన్ను వసూలు టార్గెట్‌గా నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 30 శాతం మాత్రమే వసూలైనట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో ఇంటి పన్ను చెల్లించని యజమానుల జాబితా తయారు చేయించినట్లు తెలిపారు. ఏళ్ళ తరబడి పన్ను చెల్లించని ఇళ్ళ యజమానులపై కోర్టులో కేసు పెడతామని స్పష్టం చేశారు. గత ఏడాది 50 శాతం వసూలైనట్లు తెలిపారు. ఈ ఏడాది నూరు శాతం వసూళ్ళకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మార్చి 31లోగా అన్ని గ్రామాల్లో నూరు శాతం పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శును ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించండి.

**హైస్కూల్స్‌ను సందర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్..** పదవ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులను పదికి పది జీపీఏ సాధించే దిశగా తయారు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్ ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు ఏ విధంగా సిద్ధం చేస్తున్నారో తెలుసుకొనేందుకు ఆమె సోమవారం పేరేచర్ల శింగు సీతారామయ్య ఉన్నత పాఠశాల, మేడికొండూరు ఉన్నత పాఠశాలలను సందర్శిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 326 పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 32 వేల మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయటానికి సన్నద్దమవుతున్నారని తెలిపారు. అలాగే, ప్రభుత్వం కూడా విద్యార్థులకు అల్పాహారం కింద రూ.35 లక్షల నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ గుంటుపల్లి సాంబశివరావు, ఎంపీడీవో సరళాదేవితో మాట్లాడారు. ఉపాధి హామీ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాల గురించి ఆమె వారితో చర్చించారు.

# రెండెంకెల వృద్ధి రేటుకు కృషి

## వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** రానున్న ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి రేటు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్ చెప్పారు. కృషిభవన్‌లో గత మంగళవారం మాట్లాడుతూ.... వ్యవసాయ, అనుబంధ శాఖల సమన్వయంతో రెండెంకెల వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 8.34 వృద్ధి రేటుతో రూ.5,715 కోట్ల స్థూలాదాయం సాధించామన్నారు. దీనికి సాంకేతిక పరమైన అంశాలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు రైతులు మెరుగైన సంప్రదాయ యాజమాన్య పద్ధతులను అమలుచేసేలా ప్రోత్సహించినట్లు వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ఏడాది 32 వేల భూసార పరీక్షలు నిర్వహించి 1.41 లక్షల మంది రైతులకు భూసార ధ్రువపత్రాలను పంపిణీ చెప్పారు. ఈ ఏడాది 82 వేల భూసార పరీక్షలు లక్ష్యంగా నిర్ణయించడంతో పాటు 3 లక్షల మందికి భూసార పరీక్ష ధ్రువ పత్రాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద 50 రాయితీతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వార్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ ఏడాది లక్ష సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 33 రెయిన్ గన్స్ జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ ఏడాది తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా రూ.19 కోట్లతో వ్యవసాయ యంత్రాలను అందజేసినట్లు చెప్పారు.

# చకచకా సచివాలయం పనులు

**రాజధాని ప్రతినిది, గుంటూరు :** రాజధాని అమరావతిలో ప్రారంభించిన సచివాలయము నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎల్‌అండ్‌టీ, షాపూర్జీ పల్లోంజీ సంస్థలు పనులు ప్రారంభించిన మొదటి రోజు నుంచే పోటీపడుతున్నాయి. ఎల్‌అండ్‌టీ కంపెనీ శనివారం భారీ యంత్ర పరికరాన్ని పనిలోకి దించింది. భవన నిర్మాణంలో ప్రధాన అంశమైన పునాదికి సంబంధించి వినియోగించే పైలింగ్ హామరింగ్ రిగ్గుతో పని మొదలు పెట్టారు. 600 ఎంఎం డయామీటర్ల వ్యాసార్థం కలిగిన ఎం-80 కాంక్రీటు స్తంభాలను 100 అడుగుల లోతు వరకు దించనున్నారు. పునాదిలో వినియోగించే కాంక్రీటు స్తంభాలను హైదరాబాద్‌కు చెందిన హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్ లిమిటెడ్ సంస్థ సరఫరా చేస్తోంది. సోమవారం నుంచి హామరింగ్ రిగ్గు ద్వారా స్తంభాలను పునాదిలో దించనున్నారు. షాపూర్జీ పల్లోంజీ కంపెనీ మట్టి నమూనాలను సేకరిస్తోంది. రిగ్గు ద్వారా పిల్లర్లను భూమిలో దించేందుకు పనులు చేపట్టింది.

# అతడొక పెను విధ్వంసం...

**క్రికెట్‌కు గుడ్‌పై చెప్పిన న్యూజిలాండ్ కెప్టెన్ మెకల్లమ్**



న్యూజిలాండ్ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ ఒక విధ్వం సకర బ్యాట్స్‌మన్.. రిటైర్మెంట్ మ్యాచ్‌లోనే టెస్ట్ క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ రికార్డును బద్దలు కొట్టిన అద్భుత బ్యాట్స్‌మన్ అతడు. మెకల్లమ్‌కు ముందు ఆటలో అనేక మంది గొప్ప బ్యాట్స్‌మెన్ ఉన్నారు. భవిష్యత్‌లోనూ అంతకు మించిన క్రికెటర్లు రావచ్చు. కానీ ఎంత మంది వచ్చినా మెకల్లమ్‌కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఫ్లాట్ వికెట్లపై చెలరేగే ఎంతోమంది హిట్టర్స్... పచ్చటి పిచ్‌పై బంతిని ఆడటానికి భయపడే చోట మెకల్లమ్ విధ్వంసం సృష్టిస్తాడు. అదే అతని గొప్పతనం. తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ ఈ న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్ చేసి చూపించాడు.

***12 ఏళ్లలో ఒక్క మ్యాచ్‌నూ మిస్ కాలేదు***

ప్రస్తుతం ఉన్న క్రికెట్ షెడ్యూల్‌లో ఏ ఆటగాడికీ వరుసగా అన్ని మ్యాచ్‌లూ ఆడటం సాధ్యం కాదు. అలాంటిది 12 సంవత్సరాల సుదీర్ఘ టెస్టు కెరీర్‌లో మెకల్లమ్ ఒక్క మ్యాచ్ కూడా మిస్ కాలేదు. అరం గేట్రం నుంచి వరుసగా 101 టెస్టులు ఆడిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించి రిటైరయ్యాడు. టెస్టు కెరీర్‌లో 106 సిక్సర్లతో రికార్డు, టెస్టుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ (54 బంతులు) రికార్డు కెరీర్ చివరి టెస్టులో సాధించాడు. టెస్టుల్లో ట్రిపుల్ సుంచరీ చేసిన ఏకైక న్యూజిలాండ్ క్రికెటర్ కూడా మెకల్లమే.

2002లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తర్వాత ఆరేళ్ల పాటు మెకల్లమ్ చాలా సాధారణ ఆటగాడు. 2008 తన కెరీర్‌ను మార్చేసింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్‌గా ప్రమోట్ కావడంతో కెరీర్‌లో తొలి వన్డే సెంచరీ సాధించాడు. ఇదే ఏడాది న్యూజిలాండ్‌కు తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత తను వెనుదిరిగి చూడలేదు. అంతర్జాతీయ టీ 20ల్లో అత్యధిక పరుగుల రికార్డుతో పాటు రెండు సెంచరీలు ఏకైక క్రికెటర్‌గా కూడా రికార్డు సొంతం చేసుకున్నారు.

***లీగ్‌ల్లో కనిపించనున్న మెకల్లమ్***

ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ద్వారా మెకల్లమ్ అంత ర్జాతీయ కెరీర్ ముగిసింది. అయితే తాను ఐపీఎల్‌తో సహా అనేక టి20లో లీగ్‌లలో కనిపి స్తాడు. కాబట్టి మెకల్లమ్ మెరుపులను పూర్తిగా మిస్ కాలేదు. అయితే న్యూజిలాండ్ క్రికెట్‌కు తన సేవలు లేకపోవడం పెద్ద లోటు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆటలో ఎంత దూకుడు చూపించినా ప్రత్య ర్థులతో మాత్రం చాలా స్నేహంగా వ్యవహ రించాడు. ఏనాడూ ఏ ప్రత్యర్థినీ దూషించలేదు. కెప్టెన్‌గా చక్కటి క్రీడా స్ఫూర్తితో వ్యవహ రించాడు. అందుకే తనకు మైదానం బయట స్నేహితులు,గౌరవం ఎక్కువ.

***క్రికెట్ కుటుంబం***

డునెడిన్‌లో జన్మించిన మెకల్లమ్ ప్రస్తుత వయసు 34 ఏళ్లు. ఇంకా విధ్వంసకరంగా ఆడుతూ రికార్డులు సృష్టిస్తూనే ఉన్నాడు. అయినా ఎందుకు రిటైరయ్యాడనేది పెద్ద ప్రశ్న. టి20 ప్రపంచ కప్‌కు జట్టు ఎంపికలో తనని పరిగణనలోకి తీసుకోకూడదని గత డిసెం బరులో రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. మెకల్లమ్ తండ్రి స్టువర్ట్ దేశవాళీ క్రికెట్ ఆడారు. తమ్ముడు నాథన్ మెకల్లమ్ కూడా బ్రెండన్‌తో కలిసి అంతర్జాతీయ క్రికెట్ ఆడారు.

# జగన్‌వి అసత్య ఆరోపణలు : ఉమా



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** వైఎస్సార్ సీపీని ఎమ్మెల్యేలు ఒక్కొక్కరూ వీడడం చూసి ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బేంబేలెత్తిపోతున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయలు పెట్టి శాసనసభ్యులను కొన్నామని జగన్మోహనరెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆయనలోని అభద్రతా భావాన్ని, అసహనాన్ని వాళ్ళ మాటలే తెలియజేస్తున్నాయన్నారు. ఆయన మాటలు, భాషతోనే ఆ పార్టీ శాసనసభ్యులు విరక్తి చెందారని, తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు సంపాదించుకుని అక్రమ కేసుల్లో ఏ-1 గా ఉన్నది ఆయన కాదా అని ప్రశ్నించారు. దీనికి జగన్మోహనరెడ్డి సమాధానం చెప్పాలని, కోట్ల రూపాయల అవినీతి గురించి నువ్వు, నీ శాసనసభ్యులు మాట్లాడుతున్నారు.. ఒక 420, చీటింగ్ కేసుల్లో ముద్దాయిగా ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడు కావడం రాష్ట్ర దౌర్భాగ్యమన్నారు. ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం అమరావతి శంకుస్థాపనకు రాని జగన్, ప్రధాని, హోం మంత్రి అపాయింట్‌మెంట్ కోసం ఢిల్లీలో పడిగాపులు కాశాడని విమర్శించారు. అవినీతి కేసులు తురుముకొస్తూ ఉంటే, ఆయన పత్రిక, ఛానల్ జప్తుల్లో ఉంటే ప్రభుత్వ ఆధీనంలోకి రావాల్సిన పత్రిక, ఛానల్ తమను విమర్శిస్తున్నాయన్నారు. 'నువ్వు ఢిల్లీ ఎందుకు వెళ్ళావు, నీ అక్రమ కేసులు తరుము కొస్తుంటే వాటి కోసం వెళ్ళలేదా? ఢిల్లీలో కాళ్ళు మీద పడటానికి నువ్వు వెళ్ళలేదా' అని ఉమా ప్రశ్నించారు. ఎవరి కాళ్లు పట్టుకోవటానికి ఢిల్లీ వెళ్ళావో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయలు పెట్టి తన ఎమ్మెల్యేలను తాము కొన్నామంటే, రాజకీయబ్రోకర్లని ఆయన విమర్శిస్తే నమ్మటానికి ఇవాళ తెలుగు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఎవరైతే ప్రెస్‌మీట్‌లు పెట్టి మమ్మల్ని తిడుతున్నారో ఆ శాసనసభ్యులు, ఆ ఎమ్మెల్సీలు కూడా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని చెప్పారు. 'నీ అహంకారపూరిత మాటలతో నిన్ను విభేదించిన నీ శాసనసభ్యులు సమర్థుడైన నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంతో పనిచేయటానికి వస్తుంటే తట్టుకోలేకపోతున్నావు.. నీ ఉత్తరకుమార ప్రగల్భాలకు నీ ఎమ్మెల్యేలే సమాధానం చెప్పారు.' అని ఉమా ధ్వజమెత్తారు. పోలవరం డ్యాం సైట్ ఖాళీ చేయకుండా నీ అనుచరులు ప్రాజెక్టు పనులకు అడ్డుకుంటున్నారని ఒక తహశిల్దార్ రాసిచ్చిన ఫిర్యాదుపై ఏమి సమాధానం చెబుతావని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బచ్చుల అర్జునుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్ ఎక్కడ ?

**- మరుగుదొడ్ల బిల్లులు ఓడీఎఫ్ గ్రామాలకే ...! -- బిల్లుల కోసం ఏళ్ళతరబడి ఎదురుచూపులు ...**

**రాజధాని ప్రతినిధి, తూర్పుగోదావరిజిల్లా :** మరుగుదొడ్ల నిర్మాణ బిల్లులను బహిరంగ మలవిసర్జన రహిత (ఓపెన్ డెఫెకేషన్) గ్రామాలకే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలను విధించడంతో ఏళ్ళ తరబడి ఆ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. స్వచ్ఛ భారత్ పేరుతో గ్రామాల్లో జాతి పిత మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యం, గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ, పేదరిక నిర్మూలన వంటి లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తూ ప్రగతి పథంలో ముందుకు పయనిస్తోంది. అందులో భాగంగానే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలకే ఆదర్శ దేశంగా నిలవాలని కేంద్రప్రభుత్వం తపిస్తోంది. స్వచ్ఛభారత్‌లో దేశంలో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ, బహిరంగ మల విసర్జన నిర్మూల నాంశాలను ప్రధానంగా ఎంచుకుంది. ఆ లక్ష్య సాధన దిశగా గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ప్రోత్స హిస్తూ, అందుకు అవసరమైనన్ని నిధులను విడుదల చేస్తామని ప్రకటిస్తోంది. కేంద్రంలోని ఎన్‌డీఏతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం దేవుడు భక్తునికి వరమిచ్చినా పూజారి అడ్డుకున్న సామెత మాదిరిగా భక్తునికి వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓడీఎఫ్ గ్రామాలకే వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణ బిల్లులను వర్తింపజేయాలని ఆంక్షలు విధించడమే మిటని పలువురు విమర్శిస్తున్నారు. ఈ బహిరంగ మల విసర్జన రహిత గ్రామాల నిర్మాణ పథకంలో రాష్ట్రంలోని 13 జిల్లాలోని ప్రతీ మండలం నుంచి సుమారు నాలుగు గ్రామాలను ఎంపిక చేసింది. ప్రాధాన్యతా క్రమంలో ఆయా గ్రామాల్లో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులను చెల్లిస్తోంది. ఆయా గ్రామాల్లో ఎంత మంది ఈ మరుగుదొడ్లను నిర్మించు కున్నా లబ్ధిదారుల సంఖ్యకు పరిమితులు విధించకుండా బిల్లులు చెల్లించేందుకు అంగీకరిస్తోంది. ఆ గ్రామాలు మినహా మిగతా గ్రామాల్లో ఈ పథకంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తే మాత్రం నయా పైసా చెల్లించడంలేదు. ఒక వేళ లబ్ధిదారుల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణదారులకు ప్రభుత్వం అందించే బిల్లులు కావాలను కుంటే ఆయా గ్రామాలు ఓడీఎఫ్ గ్రామాలుగా ఎంపికయ్యే వరకూ ఎదురు చూడాల్సిందే మరి. ఈ విషయం తెలియక నిర్మాణాలు చేపట్టిన వారు, ఇందిరమ్మ గృహనిర్మాణాలు పథకంలో ఇళ్ళతో పాటూ వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా నిర్మించుకుని బిల్లుల ఇప్పటికీ మంజూరు కాకా ఎదురు చూసేవారూ, ఎదురు దెబ్బలు తింటున్నారు. బిల్లులు ఇవ్వక, అప్పులు తీరక అవస్థల పడుతూ అభాసు పాలవుతున్నారు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీలు, మండల పరిషత్‌లు ద్వారా వివిధ మార్గాల్లోనూ, గృహనిర్మాణ పథ కంలోనూ బిల్లులు ఇచ్చే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించినా బిల్లులు మాత్రం వివిధ కారణాల వల్ల ఆశించిన స్థాయిలో జరుగలేదు. లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ఓడీఎఫ్ గ్రామాల నిబంధనల వల్ల ఆయా గ్రామాలకే బిల్లులు చెల్లింపులు పరిమితం అయ్యాయి. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏడీఎఫ్ గ్రామాలు కాని ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల ఆంక్షలను విధించడం 13 జిల్లాల ప్రజలకు మింగుడు పడడం లేదు.

స్వచ్ఛభారత్‌కు సాక్షాత్తూ రాష్ట్రప్రభుత్వమే మోకాలడ్డడం ప్రజానీ కానికి ఆశని పాతంలా మారింది. ఈ ఆంక్షల వెనుక లోగొట్టు పెరుమాళ్ళకెరుక అని సాధారణ ప్రజానీకం మిన్నకుండి పోతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లుల విషయంలో తమ వైఖరి మార్చుకుంటే మంచిదని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

## తుళ్ళూరులో తొలగని ట్రాఫిక్ కష్టాలు

**- పెరుగుతున్న రాజధాని కార్యకలాపాలు**

**రాజధాని ప్రతినిధి :** రాజధాని ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు తొలగడం లేదు. తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాలను రాజధాని ప్రాంతాలుగా ప్రకటించడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రియల్ ఎస్టేట్ కార్యకాలాపాలు పెరగడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, ముఖ్యుల రాకపోకలు అధికం కావడంతో రద్దీ ఎక్కువైంది. తుళ్లూరులోని లైబ్రరీ,తులసీ థియేటర్, మందడం సెంటర్లలో రోడ్డు దాటాలంటే పడే అవస్థ అంతా ఇంతా కాదు. అక్టోబరు 22న జరిగిన రాజధాని శంకుస్థాపన సందర్భంగా ప్రభుత్వం రోడ్ల విస్తరణ పనులు చేపట్టింది. ట్రాఫిక్ కష్టాలను నివారించేందుకు కొత్తగా రోడ్ల నిర్మాణం జరిపింది. ఇందులో భాగంగా రాయపూడి - తుళ్ళూరు మధ్య అమరావతి వైపునకు వెళ్ళేందుకు వీలుగా కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించారు. దీంతో వాహనాల మళ్ళింపుతో తుళ్ళూరులో ట్రాఫిక్ కష్టాలు తొలుగుతాయని అందరూ భావించారు. కానీ అలా జరగకపోగా ట్రాఫిక్ కష్టాలు మరింత పెరిగాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా మండలంలోని వెలగపూడి వద్ద తాత్కాలిక సచివాలయ నిర్మాణం చేపట్టడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సచివాలయం నిర్మాణం ప్రభావంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయని, దీంతో రాజధాని ప్రాంతానికి రాకపోకలు పెరుగుతాయని వారు హెచ్చరిస్తున్నారు. రాజధాని శంకుస్థాపన ప్రదేశంతో పాటు సచివాలయ నిర్మాణం జరిగే ప్రాంతాన్ని చూసేందుకు వచ్చే సందర్శకులతో ట్రాఫిక్ పెరుగుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# రోజాపై తాడి శకుంతల ఆగ్రహం



**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రోజాపై టీడీపీ విజయవాడ అర్బన్ ప్రతినిధి, మాజీ మేయర్ తాడి శకుంతల ఫైర్ అయ్యారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరులు సమావేశంలో శకుంతల మాట్లాడుతూ వైఎస్సార్ సీఎ పార్టీ విమర్శలు అర్థరహితమన్నారు. పార్టీ నుంచి ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు టీడీపీలోకి వెళ్ళిన విషయం తెలిసిందే. దీనిపై రోజా వారు వెళ్లిపోవడం వల్ల పార్టీకి శని వదిలిందని వ్యాఖ్యానించ డాన్ని శకుంతల తప్పుపట్టారు. ఆ పార్టీని ఏ రకంగా నడుపుతున్నారో.. అందులో పనిచేసిన వారిని ఎంత గౌరవించారో రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోందని ఎద్దేవా చేశారు. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ల సీట్లు కూడా అమ్ముకుని, ఎంపీలు ఇచ్చిన కోట్ల రూపాయలను బొక్కేసి ఒక్క ప్రజా సమస్యపై కూడా బయటకు రాని నాయకులా తెలుగుదేశం పార్టీని విమర్శించేది అంటూ ఆమె మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే మంత్రి దేవినేని ఉమాను విమర్శించే స్థాయి ఆ పార్టీ నాయకులకు లేదన్నారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న ఆరోపణలపై జగన్, లేదా రోజా గాని ఏ వేదికపై చర్చించేందుకైనా సిద్ధమేనా అని ఆమె సవాలు విసిరారు.

# ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా...

**- తెలుగు గడ్డపై ప్రవాస భారతీయుడి కుమారుడి మమకారం**

**- చంద్రబాబు ప్రోత్సహిస్తారు : ఎంపి మాగంటి బాబు**



తండ్రి మూల్పూరి రమణతో వైద్యశిబిరం నిర్వాహకుడు ప్రతీక్

***రాజధాని, ప్రతినిధి : ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా...పొగడరా నీ తల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి గౌరవాన్ని... అన్నారు ప్రముఖ సాహితీవేత్త రాయప్రోలు సుబ్బారావు...***

ప్రపంచ దేశాల్లో ఏ చోట ఉన్నా భారత మాత ముద్దుబిడ్డ మూల్పూరి ప్రతీక్ తన జాతి గౌరవాన్ని మరచి పోలేదు. ఎందెందు వెదికినా తన జాతి గౌరవాన్ని ఇనుమడింప చేసే లక్షణం భారత మాత ఇచ్చిందని, తన కుమారుడు కూడా భారత జాతి సంతతేనని ఆ జాడలోనే నడుస్తున్నాడని చాటపర్రు గ్రామానికి చెందిన ప్రతీక్ తండ్రి మూల్పూరి రమణ రాజధాని ప్రతినిధికి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన కుమారుడు చేసే సేవా కార్యక్రమాల్లో తాను సహకరిస్తున్నానని రమణ చెప్పారు.

**తాతయ్య పుట్టి పెరిగిన ఊరిని..**

స్వార్థంతో సొంత మనుషులనే మరచి పోతున్న ఈ రోజుల్లో తాతయ్య పుట్టి పెరిగిన ఊరిని జ్ఞాపకం ఉంచుకుని పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు నియోజక వర్గం చాటపర్రు గ్రామానికి సేవ చేయాలని, సంకల్పించాన న్నారు. అందరూ బాగుండాలి.. అందరిలో నేనుండాలి.. అని తన తండ్రికి జన్మనిచ్చిన జన్మభూమి రుణం తీర్చుకోవడం కోసం తెలుగు గౌరవాన్ని అమెరికా దేశంలో చాటుతున్నాడు. కీర్తి శేషులు మూల్పూరి శేషగిరిరావు తమ్ముడు కీర్తి శేషులు మూల్పూరి హరినాథ్ బాబు మనుమడు రమణ, నీతూల కుమారుడు ప్రతీక్. అతడు తోటి వారికి సేవ చేయాలనే సదుద్దేశంతో ఎల్లో పామెలో అనే సంస్థను మొదలు పెట్టాడు. తెలుగు గడ్డ మదిలో మెదిలింది. కన్న తండ్రికి జన్మనిచ్చిన భారత మాత గుర్తుకువచ్చింది. భారత మాత ఒడిలో జన్మించిన తన తండ్రి కన్న దేశానికి ఏదైనా చెయాలనే తలంపుతో చాటపర్రు గ్రామాన్ని ఎంచుకున్నాడు. నందమూరి బసవతారక రామారావు మెమోరియల్ క్యాన్సర్ ఫౌండేషన్ అండ్ ఇండో అమెరికన్ ఆర్గనైజేషన్ (అమెరికా ప్రభుత్వంతో ప్రమోట్ చేయబడిన) సంస్థ బసవరామతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో అమెరికాలోని తన సంస్థ యెల్లో పామేల్లో సంచ్ఛంద సంస్థ ద్వారా జన్మ భూమి రుణం తీర్చుకోవాలను కున్నాడు. ఉచిత కాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని దెందులూరు నియోజక వర్గం చాటపర్రు గ్రామంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఏర్పాటు చేశాడు ఈ చిన్నారి. ఏ దేశ మేగినా ఎందు కాలిడినా జన్మభూమి గొప్పదని తన తండ్రి తనకు చెబుతుంటారని ఆ



వైద్యశిబిరంలో ప్రసంగిస్తున్న ఎంపి మాగంటి బాబు

ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని తన తండ్రి పుట్టిన గడ్డ చాలా గొప్పదని విశ్వసించాన న్నారు. భారత్‌లోని బసవరామ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారం తీసుకుని క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించాలనే సంకల్పంతో ఇండియాకు వచ్చానని,తన తండ్రి పుట్టిన గడ్డ పై ముఖ్యంగా దెందులూరు నియోజక వర్గం చాటపర్రు తన తండ్రి తాత ముత్తాతల గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తు చర్యలు, వ్యాధిసోకితే ముందస్తు చర్యలకు రెండు రోజుల పాటు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశానన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వైద్య శిభారానికి ఏలూరు పార్లమెంట్ సభ్యులు మాగంటి బాబు, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌లతో పాటు టిపిపి నాయకులు గుత్తాకాశిబాబు,చాటపర్రు గ్రామ ఉపసర్పంచ్ మూల్పూరి ఉషారాణిల సహకారంతో పాటు గ్రామంలో ని పెద్దలు, నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సహాయసహకారాలు అందించారన్నారు.

**పేదలకు వైద్యం చిత్త శుద్ధితో అందజేయండి:**

ఎంపి మాగంటి బాబు : స్వర్గీయ ఎన్టీరామారావు సతీమణి శ్రీమతి బసవరామ తారకం కేన్సర్ వ్యాధితో మరణించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో కేన్సర్ ఆసుపత్రిని నిర్మించారని,అక్కడ ఎంతో మంది కేన్సర్‌రోగులకు లాభాపేక్షలేకుండా వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

# 3,886 పాఠశాలల్లో డిజిటల్ బోధన

**రాజధాని ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా 3,886 ప్రాథమికోన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన 3,886 అమలుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్టు సమన్వయకర్త రమణమూర్తి చెప్పారు. ఆర్వీఎం ప్రాజెక్టు కార్యాచరణపై 13 జిల్లాల ప్రాజెక్టు అధికారుల సమీక్ష సమావేశం సోమవారం గుంటూరులో జరిగింది. రమణమూర్తి మాట్లాడుతూ .. ఐదేళ్ల వయసు నిండిన ప్రతి చిన్నారీ పాఠశాల బాటపట్టేలా ప్రాజెక్టు అధికారులు కృషి చేయాలని సూచించారు. వచ్చే విద్య సంవత్సరం నుంచి సీఆర్‌పీలకు లక్ష్యాలు నిర్దేశించనున్నాట్లు చెప్పారు. పాఠశాలలు హరిత శోభను సంతరించుకునేలా అటవీ శాఖ సమన్వయంతో మొక్కల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. ఆర్‌వీఎం పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్‌వసతిగృహలు, కేజీబీవీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యనందించే దిశగా 2016-17 విద్యా సంవత్సరానికి నూతన కార్యాచరణతో ప్రణాళికలు రుపుదిద్దుకుంటుంన్నాయన్నారు. ప్రస్తుతం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు వివిధ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నాయని, వీటన్నిటిని రాజీవ్ విద్యా మిషన్ పరిధిలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక అవసరాలు (నైపుణ్యాలు) గల చిన్నకారులకు సేవలందిస్తున్న భవిత కేంద్రాలనునెట్‌వర్క్ పరిధిలోకి తీసుకువచ్చి మెరుగైన సేవలందించేలా చూస్తామన్నారు. 2016-17 విద్యా సంవత్సరానికి రాజీవ్ విద్యమిషన్ ప్రాజెక్టు అమలు, అభివృద్ధికి రూ.2,300 కోట్లతో కార్యచరణను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆర్వీఎం ఏపీడీ మాలాద్రి, జిల్లా పీడీ రమేష్‌కుమార్, ఆటవీశాఖ అధికారిణి సౌజన్య పాల్గన్నారు.

## 29న 'ఛలో విజయవాడ'ను జయప్రదం చేయండి

**రాజధాని ప్రతినిధి :** ముఖ్యమంత్రి చంద్రబాబు సమస్యలు సృష్టించి గిరిజనులు, బీసీల మధ్య వైషమ్యాలు పెంచుతున్నారని ఏపీగిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అనుముల వంశీకృష్ణ ఆరోపించారు. బ్రాహ్మణ, కాపు, కులాలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టే బీసీలకు కూడా ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడకపోవడంతో బీసీలను ఎస్టీ జాబితాలో కలుపుతామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భార్తీ చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో జరుప తలపెట్టిన సమావేశాంలో గిరిజనుల సమాస్యలపై చర్చించి పరష్కరించాలని, లేదంటే మార్చి21న జరిగే 'చలో విజయవాడ' నుంచిటీడీపీ ప్రభుత్వం గిరిజనులపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా 'గిరిజన జాతి వివక్ష' ఉద్యమంగా మాతుందని హెచ్చరించారు.

**బిల్డర్స్‌కు ఆహ్వానం**

విజయవాడ నుంచి కంచికచర్ల వెళ్ళే మార్గంలో 36 ఎకరాల స్థలం జాయింట్ డవలప్‌మెంట్ లేదా అమ్మకానికి, అల్ట్రా మోడల్‌టౌన్‌షిప్ (ఇండివిడ్యువల్, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ఫంక్షన్ హాల్స్) కట్టుకోవడానికి అనువుగా హైవే పక్కనే కలదు.

వివరాలకు నెం. 9676844442(రవి), 7680994755, 9440662699 సంప్రదించగలరు



# హర హర మహా దేవ..!

# శంభో శంకర..!!

**శివుడు,పార్వతి కల్యాణం జరిగిన రోజునే మహాశివరాత్రిగా హిందువులంతా భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. అంతేకాక శివరాత్రి,సివరాత్రి, శైవరాతిరి, శైవవరాత్రి, మరియు శివరాతిరి అని కూడా దీనిని అంటారు.**

**ప్రాశస్త్యం**

చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం అమావాస్య ముందు మాఘమాసంలో కృష్ణ పక్ష చతుర్దశి రోజు మహా శివరాత్రి జరుపుకొంటారు. హిందువుల పండుగలలో మహాశివరాత్రి ప్రశస్తమైనది. ఏటా మాఘ మాసం బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. శివుడు ఈ రోజు లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణంలో ఉంది. చాంద్రమాన నెల లెక్క ప్రకారం, ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ పండుగ వస్తుంది. సంవత్సరంలో పన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్ర మైంది.

**బిల్వార్చన**

పండుగనాడు బిల్వ (మారేడు) ఆకులు శివుడికి, సమర్పణలు ద్వారా జరుపుకుంటారు. రోజుంతా ఉపవాసం ఉండి, రాత్రి అంతా జాగరణ చేస్తారు. ఇది శివ భక్తులకు అద్యంత పర్వదినం. శివభక్తులంతా తెల్లవారుజామున లేచి, సాన్నం చేసి, పూజలు చేసి, ఉపవాసంతో రాత్రంతా జాగరణ చేస్తారు. మరునాడే ఇక భోజనం. రాత్రంతా శివ పూజలు, అభిషేకాలు, అర్చనలు, శివలీలా కథాపారాయణాలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవం గొప్పగా జరుగుతుంది. పూర్వం శ్రీశైలం క్షేత్రంలో జరిగే ఉత్సవమును పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రములో విపులంగా వర్ణించాడు. శైవులు ధరించే భస్మము, విభూతి తయారు చేయడం పవిత్రమైందని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమ: శివాయ", అని పవిత్ర మంత్రాన్ని పఠిస్తారు.

**ఆధ్యాత్మిక శక్తి :** తపస్సు, యోగాలను మంచిని చేయటానకి ముక్తి పొందడానికి నిర్వహిస్తారు. ఈ రోజు, ఉత్తర ధృవంలోని గ్రహ స్థానాలు అంతా బలమైన ఉత్ప్రేరకాలు చర్యతో ఒక వ్యక్తి ఆధ్యాత్మిక శక్తి పెంచడానికి సహాయంగా ఉంటాయి. మహా మృత్యుంజయ మంత్రం వంటి శక్తి వంతమైన పురాతన సంస్కృత మంత్రాల ప్రయోజనాలు శక్తి శివరాత్రి నాడు గొప్పగా పెరుగుతుంది.

**శివుడికి ఇష్టమైన రోజు**

భూమి యొక్క సృష్టి పూర్తి అయిన తరువాత, భక్తులు , పార్వతి దేవి కృతజ్ఞతలతో సంతోష పెడతామని శివుడ్ని కోరారు. అందుకు శివుడు జవాబుగా, అమావాస్య14 రాత్రి, పాల్గుణ నెలలో కృష్ణ పక్షంలో, తన అభిమాన రోజు అని బదులిచ్చాడు. పార్వతి, ఆమె స్నేహితులకు ఈ పదాలు పునరావృతం చేసింది. వీరిలో నుండి ఆ పదం సృష్టి అంతా వ్యాపించింది.

**శివరాత్రి పూజా విధానాలు**

ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చిన శివుడు అక్కడి వారితో 'మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈరోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందింది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెప్పారు. తాను ఈ విధంగా అగ్ని లింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెందిందని

**జాగరణ :** జాగరణ అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివ పూజా భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివ స్వరూపముగా భావించి,దర్శించుటమే జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానముతో సారూప్యము సిద్ధించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణ. ఈ జాగరణ సమయంలో తామున్న గృహ ఆవరణలో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు.

**రుద్రాభిషేకం :** వేదాలలో నుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్రసూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాత:కాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందుకుంటుంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం.

పంచాక్షరీ మంత్రం : పంచాక్షరీ మంత్రం శివస్తోత్రాలతో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలో పంచ అనగా అయిదు అక్షరాలను"న" "మ" "శి""వా""య" (ఓం నమశ్శివాయ) నిరంతరం భక్తితో మహాశివరాత్రినాడు పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది.

## శ్రీ శైవక్షేత్రములో శ్రీ మాహా శివరాత్రి పర్వదిన మహోత్సవములు

## భక్త మాహాశయులారా అందరికీ ఆహ్వానము

శ్రీ శైవక్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతులు "భారతధర్మ దేవత ", "ఋషిరత్న " బిరుదాంకితులు, పరమాపూజ్య శ్రీశ్రీశ్రీ శివస్వామి వారి దివ్య మంగళాశాసనములతో ... నిర్వహిస్తున్నారు.

పార్వతీ పరమేశ్వరుల సంపూర్ణ ఆశీర్వాదముతో సాక్షాత్ భూకైలాసంగా నిర్మాణము జరుగుచున్న శ్రీ శైవక్షేత్రములో మహాశివరాత్రి పర్వదిన సందర్భముగా ప్రతిష్ఠా కార్యక్రమము వేదోక్తముగా జరుపబడును. గాన భక్తుజనులు యావన్మంది ఈ అరుదైన సదావకాశమును జారవిడువక ఈ కార్యక్రమంలో పాల్గొని కనులారా చూసి జయప్రదము చేయవలసినదిగా శ్రీ స్వామి వారి తీర్థప్రసాదములను స్వీకరించి తరించ గోరుచున్నాము.

**కార్యక్రమములు:** స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ మన్మథనామ సం॥ర మాఘ బహుళ ఏకాదశి శ్రవణా నక్షత్రయుక్త మేషలగ్న పుష్కరాంశమునందు అనగా ది. 5-03-2016 వతేదిన శనివారం ఉదయం గం.8-45ని॥ల నుండి ది.7-03-2016 సోమవారం వరకూ త్రయాహ్నిక దీక్షగా సశాస్త్రరీత్యా శ్రీ మహాశివరాత్రి పర్వదిన లింగోద్భవ (నిశీధి) కాలముటో రాత్రి 11 గంటల 52 ని॥ సుముహూర్తములో ఏకకాలంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ కోటిలింగేశ్వరస్వామివార్ల దివ్యఆజ్ఞచే జరుపబడును. దివ్య ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమములు.

**కార్యక్రమములు :**

1.శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామివార్ల అన్నాభిషేకము. శ్రీ మహాశివరాత్రి పర్వదినము సందర్భముగా శ్రీ శైవక్షేత్రములో ప్రతిష్ఠ గావిచబడిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామివారికి



శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

తేది.7-3-2016 ఉదయం గం..10-00లకు అన్నాభిషేకము జరుపుకొనవచ్చును.

2. శ్రీ మహాశివరాత్రి పర్వదినమున తేది 7--2016 శ్రీ శైవక్షేత్రములో లింగోద్భవ(నిశీధి) కాలములో రాత్రి 11 గంటలు 52ని॥లకు శ్రీ అష్ఠభుజ దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ, శ్రీ కృష్ణవేణి మాతాజిచే హరహరపుత్ర అయ్యప్పస్వామివారి ఆలయ శిఖర ప్రతిష్ఠ మరియు కుంభాబిషేకం 3.శ్రీ కోటిలింగ మహాశైవక్షేత్రములో ప్రతినిత్యము జరుగుచున్న బాణలింగం, స్ఫటికలింగ, సహస్రలింగ ప్రతిష్ఠలు మహాశిరాత్రి పర్వదినమున విశేషంగా జరుగును. 4.విశ్వశాంతి లోక కళ్యాణార్థం "అష్ఠదేవతా కళ్యాణ మహోత్సవములు"

**అష్ఠకళ్యాణ వివరములు :** 1. శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ మహాగణపతి స్వామివార్ల కళ్యాణం 2.శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ కుమార స్వామి వార్ల కళ్యాణం 3. శ్రీ, భూసమేత శ్రీవిశ్వ వెంకటేశ్వరస్వామివార్ల కళ్యాణం 4. శ్రీ రుక్మిణీదేవి సమేత శ్రీ కృష్ణస్వామివార్ల కళ్యాణం 5.శ్రీ సీతాదేవి సమేత శ్రీరామచంద్ర స్వామివార్ల కళ్యాణం 6. శ్రీ రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామివార్ల కళ్యాణం 7. శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వార్ల కళ్యాణం 8 వ తేదిన7-3-2016 సోమవారం రాత్రి గం.12-30 ని॥లకు క్షేత్రాధిష్టాన దేవతలైన

శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ కోటిలింగేశ్వం స్వామివార్ల దివ్య కళ్యాణము, పట్టు పీతాంబరాలతో ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా జరుగును.

***శ్రీ పార్వతీ పరమేశ్వరుల తెప్పోత్సవ కార్యక్రమము***

తేది. 8-3-2016 మంగళవారం సాయంత్రం గం.5-05 ని॥లకు లోటస్ ఘాట్ నదీ జలాల వరకు పవిత్ర కృష్ణానదిలో శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ కోటిలింగేశ్వరస్వామి వార్లకు మంగళ వాయిద్యాలతో, వేద మంత్రఘోషతో అత్యద్భుత దీపకాంతులతో తెప్పోత్సవము జరుగును. కావున భక్తజనుఅందరూ ఈ అమోఘమైన పుణ్యోత్సవ కార్యక్రమములో పాల్గొని శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదములను స్వీకరించి తరించ కోరుచున్నాము.





శైవక్షేత్రంలో కొలువై ఉన్న సహస్ర లింగాలు

## ఫోర్బ్స్ ఆసియా యువ తారల జాబితాలో యువ క్రీడారత్నాలు



**న్యూయార్క్ :** ఫోర్బ్స్ ఆసియా యువ తారల జాబితాలో టీమ్ ఇండియా టెస్టు కెప్టెన్ విరాట్ కోహ్లి, టెన్నిస్‌లో ప్రపంచ డబుల్స్ నంబర్ 1 క్రీడాకారిణి సానియా మీర్జా , ప్రపంచ నంబర్ 2 షట్లర్ సైనా నెహ్వాల్‌లకు చోటు దక్కింది. 30 ఏళ్లలోపు వయసు కలిగిన యువ నాయకులు, ప్రతిభా వంతులు, స్ఫూర్తి ప్రదాతలతో మొత్తం పది విభాగాల్లో 30 మంది చొప్పున ఫోర్బ్స్ ఆసియా జాబితాలను రూపొందించింది. ఇందులో మొత్తం 56 మంది భారతీయులకు చోటు దక్కగా.. వినోదం, క్రీడారంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన మేటి 30 మందిలో కోహ్లి ,సానియా, సైనాలు ఉన్నారు. ఈ విభాగంలోమొత్తం ఏడుగురు భాతీయులు ఎంపికయ్యారు. ఎవరెస్ట్ అధిరోహించిన భారత తొలి వికలాంగురాలిగా ఘనత సాధించిన అరుణిమ సిన్హాతో పాటు.. నటి శ్రద్ధకపూర్, నటుడు రచయిత ఆదితి మిట్టల్, రచయిత, దర్మకుడు చైతన్య తమ్హానెలకూ ఈ జాబితిలో చోటు దక్కింది.

## 12న విజేందర్ బౌట్

**లండన్:** భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ తదుపరి ప్రొపెషనల్ బౌట్ ఖరారైంది. మార్చి 12న లివర్‌పూల్‌లో హంగేరి బాక్సర్ అలెగ్జాండర్ హొర్వాత్‌తో అతడు తలపడనున్నాడు. తొలి మూడు బౌట్లలోనూ నాకౌట్‌తో ప్రత్యర్థులను మట్టికరిపించిన విజేందర్, ఇప్పుడు నాలుగో బౌట్‌లోనూ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నాడు. ఏప్రిల్ ఆరంభంలో అతడికి మరో బౌట్ ఉంటుంది.

## అమరావతి పరిధిలో కొత్త రైల్వే పథకాలు

### రైల్వే బడ్జెట్‌లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** అమరావతి పరిధిలో కొత్త పథకాలకు నిధుల కేటాయింపు ద్వారా ప్రజల రాకపోకలు మరింత సులభతరమవనున్నాయి. మరిన్ని రైళ్లు నడిచేందుకు అవకాశం కూడా లభించనుంది. కొత్తలైన్ల ప్రారంభానికి అవకాశం కలగనుంది.

**జగ్గయ్యపేట - మేళ్లచెరువు లైన్‌కు రూ.110 కోట్లు**

జగ్గయ్యపేట - మేళ్లచెరువు లైన్‌ను కొలిక్కి తెచ్చేందుకు రూ.110 కోట్లు కేటాయించారు. ఈ మార్గంతో హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరం తగ్గుతుంది. మిర్యాలగూడ మీదుగా వెళ్ళచ్చు. ప్రస్తుతం గూడ్సు రైళ్లు మాత్రమే వస్తున్న జగ్గయ్యపేటకు ప్యాసిజర్ రైళ్లు వచ్చేందుకు వీలు కలుగుతుంది.

**కాజీపేట-విజయవాడ మధ్య రూ.50 కోట్లు**

కాజీపేట-విజయవాడ మధ్య మూడోలైను, విద్యుద్దీకరణకు రూ.50 కోట్లు ప్రటించారు. ఈ మార్గంలో రద్దీ అధికంగా ఉంది. దానిని తట్టుకునేందుకు మూడో మార్గం తోడ్పడనుంది. అదనపు రైళ్లు నడిపేందుకు అవకాశం కలుగనుంది. విద్యుత్తు రైళ్లు మరిన్ని అందుబాటులోకి వస్తాయి.

అదనపు మార్గానికి రూ.80 కోట్లు

విజయవాడ -గుడివాడ మచిలీపట్నం -భీమవరం నర్సాపూర్-నిడదవోలు మధ్య డీజిల్ సర్వీసులు నడుస్తున్నాయి. ఒకేలైన్ ఉంది. విద్యుద్దీకరణ, అదనపు మార్గం కోసం రూ.80 కోట్లు ప్రటించారు. తద్వారా రైళ్లు వేగంగా నడిచేందుకు మరిన్ని సర్వీసులకు చోటు దొరకనుంది.

**రెండు లైన్ల విద్యుదీకరణకు రూ.150 కోట్లు**

విజయవాడ -గూడూరు, దువ్వాడ-విజయవాడ మూడో లైను విద్యుద్దీకరణకు బడ్జెట్లో రూ.150 కోట్లు ప్రకటించారు. గూడ్సు రైళ్లు ఎక్కువచోట్ల ఆగకుండా వెళ్ళేందుకు వీలు కలుగనుంది. ఢిల్లీ-చెన్నై మధ్య రాకపోకలు సులభతవమవుతాయి. ప్రత్యేక సరకు రవాణా మార్గంలో రాజధాని వ్యాపారాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.



## పనిచేయని ఎన్‌టీఆర్ సుజల పథకం

### కొత్తపల్లిలో తాగునీటి కష్టాలు

**రాజధాని ప్రతినిధి, యు.కొత్తపల్లి :** ప్రజలందరికీ 2 రూపాయిలకే 20 లీటర్ల తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్‌టీఆర్ సుజల పథకం ఏర్పాటు చేసింది. కాని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ పథకం సక్రమంగా పనిచేసినట్లు కనిపించడం లేదు. కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామ పంచాయతీ పక్కన ఉన్న భవనంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ సుజల పథకం గత రెండు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో తాగునీరు కోసం గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వస్తున్నది వేసవి కావడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మత్తులు నిర్వహించాలని కోరారు.




కొండెవరంలో పనిచేయని ఎన్.టి.ఆర్ సుజల పథకం

**అదనపు ఆదాయం**

మీకు తీరుస్తుంది ఎన్నో అవసరాలు!
మీరు ఏ రంగానికి చెందిన వారైనా సరే!
ఉద్యోగులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు, వ్యవసాయ దారులు,
గృహిణలు మీరు ఏ పనిలో ఉన్నా
పూర్తి కాలం (ఫుల్‌టైం) లేదా పరిమిత కాలం(పార్ట్ టైం)
మీ అవకాశాన్ని బట్టి, మీ నోటి మాటే పెట్టుబడిగా
ఆదాయం సమకూర్చుకునే అద్భుత అవకాశం మీ కోసం ఎదురు చూస్తున్నది
వెంటనే సంప్రదించండి
9440662699, 9676844442

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, APTEL 14598 / 2015.